వ్యవసాయ కరదీపికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్



ప్రాధాన్యతా రంగాలను పటిష్టం చేయాలి

● కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రాధాన్యతా రంగాల పటిష్టతతోనే జిల్లా అన్ని విధాల అభివృద్ధి పథంలో నడుస్తుందని, ఆ దిశగా అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో అన్ని రకాల ప్రాధాన్యతా రంగాలకు చెందిన జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వ్యసాయ శాఖ పరిధిలో జిల్లాలో రబీ సాగును పెంచడంతో పాటు అధిక దిగుబడులు సాధించేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి రైతు పంటలకు ఈ-క్రాప్ బుకింగ్‌తో పాటు ఈకేవైసీ పూర్తిచేయాలన్నారు. పురుగు మందులు, ఎరువులు కొరత లేకుండా చూడాలన్నారు. అలాగే సాయిల్ వెల్త్ ప్రాసెసింగ్ సెంటర్స్ నిర్వహణను పెంచాలన్నారు. జిల్లాలో ఎక్కువగా సాగులో ఉన్న ఉద్యానపంటలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఏపీఎంఐపీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు సన్నకారు రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో వర్షపాతం తక్కువ నమోదు దృష్ట్యా సూక్ష్మ సేద్యాన్ని ప్రోత్సహించాలన్నారు. పాడి పరిశ్రమ, పౌల్ట్రీ, గొర్రెలు, మేకల పెంపకం దారులు పశుబీమా తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతు బజార్లలో మార్కెటింగ్, గిడ్డంగి పనులు పూర్తి చేయాలన్నారు. పౌరసరఫరాల శాఖ ద్వారా జిల్లాలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు సజావుగా, రైతులకు ఇబ్బంది లేని విధంగా సాగేలా చూడాలన్నారు. పట్టుపరిశ్రమకు పునరుజ్జీవం కల్పించాలన్నారు. అనంతరం మండల స్థాయిలో వ్యవసాయ శాఖలకు సంబంధించిన స్థితిగతులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వివిధ పంటల్లో పురుగులు, ఎరువుల యాజమాన్యంపై వ్యవసాయ శాఖ ప్రచురించిన కరదీపికను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, ఇరిగేషన్ ఎస్ఈ వెంకట్రామయ్య, పీఎంఐపీ పీడీ వెంకటేశ్వరరెడ్డి, డీసీవో సుభాషిణి, హార్టికల్చర్ డీడీ సుభాషిణి, సిరికల్చర్ ఏడీ శ్రీనివాసులు, పశుసంవర్ధక శాఖ జేడీ శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాల పెంపుకోసం శిక్షణ

● డీఈఓ మీనాక్షి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నామని డీఈవో మీనాక్షి తెలిపారు. కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు పర్ఫార్మెన్స్, అసెస్మెంట్ రివ్యూ అండ్ అనలైజ్ ఆఫ్ నాలెడ్జ్ ఫర్ హోలిస్టిక్ డెవలప్‌మెంట్ (పరాక్) సర్వేక్షణ-2024 కార్యక్రమాన్ని రూపొందించాయన్నారు. ఇందులో భాగంగా గురువారం కడప నగరం సీఎస్ఐ హైస్కూలులో 3, 6, 9 తరగతులకు సంబంధించి ఉపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు ఏ మేరకు ఉన్నాయని తెలుసుకునేందుకు పరాక్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో 139 పాఠశాలలను ఈ పరీక్ష కోసం ఎంపిక చేశామన్నారు. ఒక్కో పాఠశాల నుంచి 3, 6, 9 తరగతులకు సంబంధించి 90 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షలు ఎలా నిర్వహించాలనే దానిపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి జి.విజయభాస్కర్, ఆర్పీలు వెంకటేశ్వర్‌రెడ్డి, ఖాసింఖాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో మీనాక్షి

అసెంబ్లీ సాక్షిగా.. కర్నూలుకు హైకోర్టు బెంచ్



● తీర్మానం ప్రవేశపెట్టిన న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్
● ఏకగ్రీవంగా ఆమోదించిన శాసనసభ
● రాయలసీమ ఎమ్మెల్యేలు, మంత్రుల హర్షం
● ఇప్పటికే హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు ప్రభుత్వం లేఖ
● ప్రజాగళం సభలో చంద్రబాబు హామీ
● ఐదు నెలల్లోనే అమలుకు శ్రీకారం
● ఐదేళ్ల పాటు నాన్చిన జగన్ ప్రభుత్వం



కర్నూలు/కడప, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు ప్రక్రియలో మరో ముందడుగు పడింది. ఇప్పటికే హైకోర్టు అభిప్రాయం కోరుతూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు రాష్ట్ర న్యాయ శాఖ కార్యదర్శి వి.సునీత గత నెల 28న లేఖ రాశారు. బుధవారం మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గురువారం రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తీర్మానం ప్రవేశ పెట్టగా శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. రాయలసీమ ఎమ్మెల్యేలు, మంత్రులు హర్షం వ్యక్తం చేశారు.

వైసీపీ ప్రభుత్వం కర్నూలు న్యాయ రాజధాని అని అక్కడ హైకోర్టు ఏర్పాటు చేస్తాం అంటూ సీమ ప్రజలను ఐదేళ్లు మభ్యపెట్టింది. ఎన్నికల ముందు ప్రజాగళం సభలో కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ప్రతిపక్ష నేతగా చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారం చేపట్టిన ఐదు నెలలకే అమలు దిశగా సీఎం చంద్రబాబు సారథ్యంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. అసెంబ్లీ తీర్మానంపై రాయలసీమ వ్యాప్తంగా న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఐదేళ్లు మభ్యపెట్టిన వైసీపీ

కర్నూలులో హైకోర్టు అంటూ వైసీపీ రాజకీయ స్వలాభం కోసం ఐదేళ్లు మభ్యపెట్టారు. మరోవైపు రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమి మంగళగిరిలో ఏర్పాటుకు సంబంధించి జీవో ఇచ్చారు. 2022 డిసెంబరు 5న కర్నూలు నగరంలోని ఎస్టీబీసీ కళాశాల మైదానంలో వైసీపీ నిర్వహించిన సీమ గర్జన సభలో జిల్లాకు చెందిన అప్పటి మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కర్నూలును న్యాయరాజధానిగా మారుస్తాం.. హైకోర్టు ఏర్పాటు చేస్తాం అంటూ పదేపదే ఉపన్యాసాలు ఇచ్చారు. బుగ్గన ఓ అడుగు ముందుకేసి కర్నూలు నగరానికి నాలుగు వైపులా 25 కిలోమీటర్ల దూరంలో కనిపించేలా జగన్నాథగట్టుపై అందమైన హైకోర్టు భవనాన్ని నిర్మిస్తామని చెప్పారు. మాయ చేశారే తప్పా అమలుకు చర్యలు చేపట్టలేదు.

ఐదు నెలల్లోనే..

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని 2019 ఎన్నికల్లో అప్పటి సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయి.. వైసీపీ అధికారం చేపట్టింది. అయినా చంద్రబాబు మాట మార్చలేదు. అదే హామీకి కట్టుబడి నిలబడ్డారు. గత ఎన్నికల్లో అధికార వైసీపీ నేతలు, సీఎం జగన్ కర్నూలు న్యాయ రాజధాని, హైకోర్టు ఏర్పాటు చేస్తామని హామీ ఇస్తే.. ప్రతిపక్ష నేతగా చంద్రబాబు 'హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కట్టుబడి ఉన్నాం.. అధికారంలోకి రాగానే ఆ ప్రక్రియ మొదలు పెడుతాం..' అంటూ ప్రజాగళం సభలో స్పష్టమైన హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలలకే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు దిశగా వేగంగా అడుగులు వేసింది. హైకోర్టు అభిప్రాయం కోరుతూ గత నెల 28న లీగల్ అండ్ లెజిస్లేటివ్ అఫైర్స్ అండ్ జస్టిస్, లా డిపార్ట్‌మెంట్ ప్రభుత్వ కార్యదర్శి వి.సునీత గత నెల 28న లేఖ నంబరు.2589691/ఎస్‌సీ.ఎఫ్/ఏ2/2024 కింద హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు లేఖ రాశారు. ఆ వెంటనే బుధవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గం సమావేశంలో ఆమోదం, గురువారం శాసనసభ, మండలిలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ చర్యలో పాల్గొన్న రాయలసీమ జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేల హర్షం వ్యక్తం చేశారు.

సాకారం దిశగా 87 ఏళ్ల స్వప్నం

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు 87 ఏళ్ల స్వప్నం. బెంచ్ రూపంలో సాకారం కాబోతోందని రాయలసీమ న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. 1937 నవంబరు 16న మద్రాస్‌లో కాశీనాథుని నాగేశ్వరరావు స్వగృహంలో శ్రీబాగ్ భవనంలో జరిగిన కోస్తాంధ్ర, రాయలసీమ ప్రతినిధుల సమావేశంలో రాయలసీమలో రాజధాని లేదా హైకోర్టు ఏర్పాటు చేయాలని ఒప్పందం కుదిరింది. ఆ ఒప్పందమే 'శ్రీబాగ్ ఒడంబడిక'. 1952 అక్టోబరు 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుతో కర్నూలు కేంద్రంగా రాజధాని ఏర్పాటు చేసినా నాలుగేళ్ల ముచ్చటగానే ముగిసింది. 1956 నవంబరు 1న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటుతో రాజధాని హైదరాబాద్‌కు తరలిపోయింది. అయితే.. సీమ ప్రజల మదిలో శ్రీబాగ్ ఒడంబడిక అంశాలు చెదిరిపోలేదు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి హైకోర్టు బెంచ్ ఏర్పాటు కోసం అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేశారు.

హైకోర్టు బెంచ్ ఏర్పాటు అభినందనీయం

వేంపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలోని కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయమని పీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అ న్నారు. 1937 నుంచి శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం రాజధాని గాని, హైకోర్టు గాని ఏదొకటి రాయలసీమలో ఏర్పాటుచేయాలని ఉంది. కానీ దురదృష్టవశాత్తు అమరావతిలోనే రెండు ఏర్పాటయ్యాయన్నారు. ఇందుకు ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రతిపక్షనేత వైఎస్ జగనే కారణమన్నారు. ఇప్పటికైనా కర్నూలులో ఏర్పాటుచేయాలని నిర్ణయించడం శుభ పరిణామమన్నారు. కొప్పర్తి పారిశ్రామిక వాడ నుంచి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సాంకేతిక శిక్షణా కేంద్రాన్ని, కర్నూలు నుంచి జాతీయ మానవహక్కుల కమీషన్, సీబీఐ కోర్టు, వక్ఫ్ ట్రిబ్యునల్ కార్యాలయాలను అమరావతికి తరలించాలని నిర్ణయించడం దురదృష్టకరమన్నారు.

ఇది చారిత్రాత్మక నిర్ణయం..

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు తీర్మానం ప్రవేశ పెట్టడం ఆనందంగా ఉంది. సీఎం చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి శాసనసభ, మండలిలో ఏకగ్రీవంగా తీర్మానం చేయడం చారిత్రాత్మకం. రాయలసీమ ప్రాంతాన్ని వివిధ రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు సీమ బిడ్డగా సీఎం చంద్రబాబు కృషి అభినందనీయం. శాశ్వత బెంచ్ ఏర్పాటుతో సీమ ప్రజలకు న్యాయ సేవలు కర్నూలులోనే అందుబాటులోకి వస్తాయి.

- ఎన్ఎండీ ఫరూక్,
న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి, నంద్యాల

ఏడాదిలో ప్రక్రియ పూర్తి చేయాలి..

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తే ఆ రోజు స్పష్టంగా చెప్పాం.. పరిపాలన సౌలభ్యం కోసం రాజధానిలోనే ఉండాలని. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. న్యాయ శాఖ మంత్రి మంత్రి ఫరూక్ నాయకత్వంలో బెంచ్ ఏర్పాటు కాబోతుండడం ఆనందంగా ఉంది. ఏడాదిలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరుతున్నాను.

- నారా లోకేశ్, ఐటీ, విద్యా శాఖ మంత్రి

వైసీపీ మాట తప్పింది.. మడమ తిప్పింది..

వైసీపీ ప్రభుత్వ హయాంలో హైకోర్టు ఏర్పాటు చేస్తామని పాలాభిషేకాలు చేయించుకున్నారు. మాట తప్పం.. మడమ తిప్పం అన్నారు. మాట తప్పి మడత తిప్పి రాయలసీమ ద్రోహిగా జగన్ నిలిచారు. చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఆ మేరకు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం అభినందనీయం.

- ఆర్.సవిత, వైఎస్సార్ కడప జిల్లా
ఇన్‌చార్జి మంత్రి

సీమ ప్రజలకు ఎంతో ఉపయోగం..

హైకోర్టులో రాయలసీమ జిల్లాలకు చెందిన కేసులే 50 శాతానికిపైగా ఉన్నాయి. కర్నూలులో బెంచ్ ఏర్పాటు చేస్తే ఎనిమిది జిల్లాల ప్రజలకు ఉపయోగంగా ఉంటుంది. టీడీపీ కూటమి ప్రభుత్వం బెంచ్ ఏర్పాటుపై సభలో ఏకగ్రీవ తీర్మానం చేయడం.. ఆ తీర్మానంలో నేను భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉంది. ఇది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం అని సీఎం చంద్రబాబు చాటిచెప్పారు.

- పుత్తా చైతన్యకుమార్‌రెడ్డి,
కమలాపురం ఎమ్మెల్యే, కడప జిల్లా

ఈత.. కడుపుకోత..!



● మృతుల్లో ఎక్కువమంది పిల్లలే ● తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్త వహించాలి

నీళ్లను చూస్తే అదో సరదా.. పిల్లలకే కాదు పెద్దలకూ నీటిలో దిగాలనిపిస్తుంది. నీళ్లతో ఆడుకోవాలనిపిస్తుంది. ఈత వచ్చిన వారైతే పర్వాలేదు.. ఈత రాని వారు కూడా నీటిలోకి దిగి ప్రమాదాల బారిన పడుతున్నారు. తక్కువలోతే కదా అని నీటిలోకి దిగి.. మృత్యువాతపడుతున్నారు. ఇలా చనిపోతున్న వారిలో ఎక్కువమంది పిల్లలు, యువకులే ఉండటం గమనార్హం. చివరికి కన్నవారికి కడుపు కోత మిగుల్చుతున్నారు.

కడప క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నదులు, డ్యామ్‌లు, చెరువులు.. ఏదైనా సరే నీళ్లు ఉన్నాయంటే చాలు కొందరు ధైర్యం గల పిల్లలు ఈదులాడేందుకు రెడీ అవుతారు. ఇంట్లో కూడా చెప్పకుండా స్నేహితులతో కలిసి వెళ్లి తిరిగిరాని లోకాలకు చేరుతున్నారు. నీటిలో దిగితే కానీ లోతు తెలియదు. ఏముందిలే లోతు అని నీటిలో దిగితే ఎక్కడ గుంతలు ఉన్నాయో ఎక్కడ లేవో తెలియక గుంతల్లో ఇరుక్కుని బయటికి రాలేక తనువు చాలిస్తున్నవారెందరో. కొంత మంది ఈత వచ్చిన వారు కూడా ఈత రానివారితో కలిసి వెళ్లి వారిని రక్షించబోయి తాము కూడా ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది.

డ్యామ్‌లు, చెరువులు, నదుల్లో ప్రమాదాలు

జిల్లాలో ఈత సరదా కోసం వెళ్లి ఎంతో మంది మృత్యువాత పడుతున్నారు. చెక్‌డ్యాంలు, చెరువులు, నదులు, కుంటలు, కాల్వల్లోనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వాటి లోతు తెలియక దిగుతూ ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. ఇలా చనిపోతున్న వారిలో ఎక్కువమంది ఈతరానివారే. కొందరికి ఈత వచ్చినా.. గుంతల్లో ఇరుక్కుని బయటికి రాలేక తనువు చాలిస్తున్నారు.

సెలవులు వచ్చాయంటే..

వేసవి కాలంలో సెలవులు వచ్చాయంటే ఎక్కువగా పిల్లలు స్నేహి తులతో కలిసి సరదాగా ఈతకెళుతుంటారు. పిల్లలు ఎక్కడికి వెళుతున్నారు.. ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు దృష్టి పెట్టకపోవడంతో సరదాగా ఈతకెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకుంటుండడం గమనార్హం. నదుల్లో నీటి ఉధృతి తెలియక నీటిలోకి దిగగానే గల్లంతువుతున్నారు. చెరువులు, కుంటల్లో లోతును గుర్తించకుండా నిర్లక్ష్యంగా దిగి ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. ఇలా ప్రతి ఏడాది ఎంతో మంది పిల్లలు, యువకులు మృత్యువాత పడి తల్లిదండ్రులకు తీరని శోకం మిగిల్చుతున్నారు.



పెన్నానదిలో ఏడుగురు చనిపోవడానికి ముందు తీసుకున్న సెల్ఫీ (ఫైల్)

నీటి ప్రమాదాల్లో చనిపోయినవారు

● ఇటీవల కడప రిమ్స్ సమీపంలోని పాలకొండల్లో ఓ బాలుడు నీటి మడుగు వద్ద సెల్ఫీ తీసుకుంటూ ప్రమాదవశాత్తు లోయలో పడి మృతి చెందాడు.

● కడప నగరం మృత్యుంజయకుంటకు చెందిన బాలుడు స్నేహితులతో కలిసి వాటర్‌గండికి వెళ్లాడు. అక్కడ సరదాగా స్నేహితులతో ఈత ఆడుతున్న క్రమంలో గల్లంతై చివరికి మృత్యుఒడిలోకి చేరాడు.

● నాలుగు రోజుల క్రితం పుష్పగిరి పెన్నానదిలో బాలుడిని కాపాడబోయి ఓ యువకుడు గల్లంతయ్యాడు. చివరకు సిద్దవటం మండలం లింగంపల్లి వద్ద పెన్నానదిలో శవమై తేలాడు.

● 2020 జనవరి 2వ తేదీన నూతనసంవత్సర వేడుకల సందర్భంగా సిద్దవటం పెన్నానదికి ఈతకు పోయి ముగ్గురు నీటమునిగి చనిపోయారు.

పిల్లలపై ఓ కన్నేసి ఉంచాలి..



సెలవులు ఉన్నప్పుడు పిల్లలను తల్లిదండ్రులు, వారి కుటుంబసభ్యులు ఓ కంట కనిపెడుతూ ఉండాలి. వారు ఎక్కడికి వెళ్లేది గమనిస్తూ ఉండాలి. నదులు, చెరువుల్లో ఈత ఆడేందుకు పిల్లలు నీటిలో దిగి చనిపోతున్నారు. అధికారులతో చర్చించి ప్రమాదాలు జరిగే ప్రాంతాలు గుర్తించి అక్కడ బారికేడ్లు ఏర్పాటు చేస్తాం. కార్తీకమాసం సందర్భంగా నదులు చెరువుల వద్ద ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. పిల్లలు కూడా నీటి ప్రవాహం ఉన్న వైపు వెళ్లకూడదు.

- బసిరెడ్డి, జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి,
కడప ఫైర్ స్టేషన్ అధికారి


● 2020 డిసెంబరు 17న సిద్దవటం వద్ద పెన్నానదిలో ఏడుగురు యువకులు మృత్యువాత పడ్డారు.

● 2021 ఏప్రిల్ 6న ఎర్రగుంట్లలో ఈతకు వెళ్లిన సయ్యద్‌బాషా, క్రిష్ణచైతన్య, షేక్ కమాల్‌బాషా మృతి చెందారు.

● గతేడాది మే 14న లింగాల ప్రాంతంలో నీటి మడుగులో ఈతకు వెళ్లి విశ్వంత్, శివసాయి చరణ్ చనిపోయారు.

● ఈ ఏడాది అక్టోబరు 1 తేదీన మైదుకూరు సమీపంలో ఈత ఆడుతూ షేక్ యాసిన్, షేక్ రఫీ గల్లంతయ్యారు. చివరికి నీటిలో శవాలుగా తేలారు.

ఇలా నీటి ప్రమాదాల్లో ప్రతి ఏడాది పలువురు చనిపోతున్నారు. ఏదిఏమైనా నీళ్లు ప్రవహించే ప్రాంతాల్లో జాగ్రత్త పడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఇద్దరు స్నేహితులను కాపాడి..!

● అసువులు బాసిన మరో మిత్రుడు ● మామండూరు వద్ద వాగులో ప్రమాదం



ప్రమాదానికి ముందు వాగులో స్నేహితులు సరదాగా తీసుకున్న ఫొటో

రేణిగుంట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వాగులో మునిగిపోతున్న ఇద్దరు స్నేహితులను కాపాడాడు. ఆ క్రమంలో తాను నీట మునిగి మృత్యుఒడికి చేరాడు 20 ఏళ్ల హేమాద్రి. రేణిగుంట మండలం మామండూరు వద్ద వాగులో గురువారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కడప జిల్లా పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన గంగరాజు కుమారుడు హేమాద్రి(20).. తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో బీఏ ఫైనలియర్ చదువుతున్నారు. తన ఎనిమిది మంది స్నేహితులతో కలిసి గురువారం మామండూరు అతిథిగృహం వద్దకు వచ్చారు. కొంతసేపు స్నేహితులంతా సరదాగా గడిపారు. ఆ తర్వాత ఈత కొట్టడానికి సమీప అటవీ ప్రాంతంలోని వాగు వద్దకు వెళ్లారు. ఈ వాగులోకి దిగి నడుము లోతులో ఉండే ప్రాంతంలో సరదాగా నీటిలో మునుగుతూ ఉన్నారు. ఈ క్రమంలో ఇద్దరు స్నేహితులు లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతంలోకి వెళ్లారు. ఈత రాక వారు మునిగిపోతుండడం గుర్తించిన హేమాద్రి.. తనకు ఈత రాకపోయినా తన స్నేహితులను కాపాడడానికి విఫలప్రయత్నం చేశారు. ఎట్టకేలకు ఇద్దరు స్నేహితులను కాపాడిన హేమాద్రి.. ఆ లోతు గుంతలో చిక్కుకుని మునిగిపోయారు. మిగిలిన వారు విలపిస్తూ సమీపంలోని స్థానికులను కలిసి తమ స్నేహితుడిని కాపాడాలని కోరారు. ఈ ప్రమాద సమాచారం తెలిసి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాగులో మునిగిపోయిన హేమాద్రి కోసం గాలించారు. కొంతసేపటి తర్వాత మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన హేమాద్రి

చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

● రూ.24 లక్షల విలువైన 17 కేజీల వెండి, 130 గ్రాముల బంగారం స్వాధీనం
● వివరాలు వెల్లడించిన రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్

6



మహిళ దారుణ హత్య

● గుర్తుపట్టలేని విధంగా రాళ్లతో మొహంపై కొట్టిన దుండగులు
● ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఇన్‌చార్జి ఎస్పీ, డీఎస్పీ

కాశినాయన/ప్రొద్దుటూరు నవంబరు21(ఆంధ్రజ్యోతి): కాశినాయన మండలంలోని చెన్నవరం కొండపేట గ్రామాల మధ్య పొలాల్లో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఓమహిళను దారుణంగా హత్యచేశారు. కాశినాయన ఎస్ఐ హనుమంతు వివరాల మేరకు...

చెన్నవరం సచివాలయానికి కూతవేటు దూరంలో ప్రధాన రహదారికి సమీప పొలాల్లో మహిళను రాళ్లతో ముఖంపై గుర్తుపట్టలేని విధంగా కొట్టిచంపారు. ఆమె శరీరంపై బట్టలు కూడా లేవు. గురువారం ఉదయం సమీప గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించగా అక్కడ దొరికిన ఆనవాళ్లను బట్టి మృతురాలు చాపాడు మండలం ఖాదర్‌పల్లె గ్రామానికి చెందిన చిన్నదండ్లూరు కరీమున్నీసా(35)గా గుర్తించారు. రాత్రి వేళ ఈ మారుమూల ప్రాంతానికి మహిళ ఎలావచ్చింది, ఈ సంఘటనకు ఎవరు బాధ్యులు అన్న అంశంపై లోతుగా దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు. సంఘటన జరిగిన ప్రాంతంలో హ్యాండ్‌బ్యాగ్ దొరికిందని అందులో కొన్ని ఫోన్‌నెంబర్లు ఉన్నట్లు తెలిసింది. దుండగులు మహిళను వివస్త్రను చేసి చంపడంతో పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఘటనా ప్రాంతాన్ని ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి పరిశీలించారు. కాగా.. హత్యకు గురైన కరీమున్నీసాకు చాపాడు మండలంలోని ఖాదర్‌పల్లె గ్రామానికి చెందిన చిన్నదండ్లూరు నాసీర్‌తో 12 ఏళ్ల కిందట వివాహం జరిగింది. ఆమె స్వగ్రామం రాజుపాళెం మండలంలోని కొర్రపాడు గ్రామం. వీరు ప్రొద్దుటూరులో నివాసం ఉంటున్నారు. అప్పుడప్పుడు ఖాదర్‌పల్లె గ్రామానికి వచ్చిపోతుండేవారు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు సంబంధించి డబ్బు పంపిణీలో తేడాలు రావడంతోనే ఆ మహిళను స్మగ్లర్లు చంపి ఉంటారేమోనని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



సంఘటన స్థలంలో మహిళ మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్

యువత 'ఉన్నతి'కి శిక్షణ

● ఉపాధి కూలీల కుటుంబాలకు ప్రోత్సాహం ● శిక్షణ కాలంలో ఆర్థిక ప్రయోజనం

కడప (ఎన్టీఆర్‌సర్కిల్), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా పనులు పొందిన కుటుంబాల్లో చదువుకున్న యువతకు 'ఉన్నతి' కార్యక్రమం ద్వారా శిక్షణ ఇచ్చి వివిధ రకాల జీవనోపాధుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు. వివిధ రంగాల్లో నైపుణ్యం వచ్చేలా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ సీడాప్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తోంది. ఉపాధి హామీ పథకం ద్వారా పనిచేసే వారి పిల్లల్లో నైపుణ్యాన్ని పెంపొందించి ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. వంద రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబంలోని యువతకు శిక్షణ ఇస్తున్నారు. అర్హులైన కుటుంబంలో పదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదివిన వారిని గుర్తించి వారి ఆసక్తి మేరకు పలు రంగాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇందుకోసం ఉమ్మడి కడప జిల్లాలోని పులివెందులలో న్యాక్ సెంటరు, కడపలో టీటీడీసీ, రాజంపేటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు.




శిక్షణ పొందుతున్న యువత

పులివెందులలో సర్వేయరు, సోలార్ పీవీ మ్యాడ్వెల్, మ్యాన్యుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, ఏసీ టెక్నీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తారు. ఇక్కడి శిక్షణ కేంద్రం డెకాన్ కంపెనీతో ఒప్పందం చేసుకుంది. అదేవిధంగా కడపలోని టీటీడీసీలో ఉన్న స్కిల్ కాలేజీలో డిపార్ట్‌మెంట్ స్టోరు మేనేజరు అండ్ రిటైల్ సేల్స్ అసోసియేట్ రంగంలో శిక్షణ ఇస్తున్నారు. రాజంపేటలోని గవర్నమెంటు పాలిటెక్నిక్ కళాశాలలో సేల్స్ అసోసియేట్ రంగంలో శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ కాలపరిమితి 90 నుంచి 120 రోజులు ఉంటుంది. శిక్షణా కాలంలో రోజు కూలీ రూ.300 చొప్పున 90 రోజులకు శిక్షణ కాలానికి సుమారు రూ.27 వేల వరకు ఆర్థిక సాయం అందిస్తారు. కోర్సుకు అవసరమైన మెటీరియల్‌తో పాటు స్త్రీ, పురుషులకు యూనిఫాం ఉచితంగా హాస్టలు వసతి కూడా కల్పిస్తున్నారు. హైస్పీడ్ ఇంటర్‌నెట్ ల్యాబ్ కూడా అందుబాటులో ఉంటుంది. శిక్షణ అనంతరం ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్‌తో పాటు ప్రముఖ ప్రైవేటురంగ సంస్థల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు.

ఎంపిక ఇలా..

ఉపాధి పథకంలో వంద రోజుల పనిదినాలను పూర్తి చేసుకున్న వారి వివరాలను ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నతి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. వాటిని డీఆర్‌డీఏ, సీడాప్ సిబ్బంది క్షేత్రస్థాయిలో క్రాస్‌చెక్ చేసి వంద రోజులు పని చేసిన వారి అభిప్రాయాలను సేకరిస్తారు. ఇందులో వారి కుటుంబంలో ఎవరైనా చదువుకున్న యువత ఉంటే వారి ఆసక్తిని బట్టి స్వయం ఉపాధి కల్పనకు శిక్షణ ఇస్తారు. జిల్లాలో ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు 18,962 కుటుంబాలు వంద రోజుల పని పూర్తి చేసుకున్నట్లు గుర్తించారు. వీరి కుటుంబాల్లో 18 నుంచి 35 సంవత్సరాల్లోపు వయసు ఉన్న వారికి వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి చూపనున్నారు. ఈ మేరకు ఇప్పటికే తొలివిడత శిక్షణ ప్రారంభమైంది.

ఉన్నతికి ఉచిత శిక్షణ ఇస్తున్నాం



ఉపాధి హామీ పథకంలో వంద రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న వారికి మరింత మెరుగైన జీవనోపాధుల కోసం వారి కుటుంబంలో చదువుకున్న పిల్లలకు శిక్షణ ఇస్తున్నాం. ఇప్పుడిప్పుడే ఈ కార్యక్రమం ద్వారా ప్రవేశాలు జరుగుతున్నాయి. డ్వామా పీడీతో మాట్లాడి మరింత మందికి శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- ఆనంద్‌నాయక్, పీడీ, డీఆర్‌డీఏ

సేల్స్ రంగంలో ఉద్యోగం కావాలి



మాది నిరుపేద కుటుంబం. కూలీ వల్లనే జీవనం. ఉపాధి హామీ పథకం ద్వారా మా తల్లిదండ్రులు పనులకెళ్లేవారు. నేను బీకాం వరకు చదివాను. ప్రభుత్వ ఉద్యోగం వచ్చే పరిస్థితి కనిపించలేదు. ఉపాధి హామీ కూలీల పిల్లలకు శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశం కల్పిస్తారని తెలిసింది. ప్రస్తుతం టీటీడీసీలో శిక్షణ పొందుతున్నాను. సేల్స్ రంగంలో ఉద్యోగం చేయాలన్నది నా కోరిక.

- కె.సుకన్య, గంగనపల్లె, కాశినాయన మండలం

రిటైల్ రంగంలో శిక్షణ తీసుకుంటున్నా



మా తల్లిదండ్రులతో పాటు నేను కూడా ఉపాధి హామీ పనికి వెళ్లేవాడిని. ఇంటర్ వరకు చదువుకున్నాను. వందరోజుల పనిదినాలు పూర్తి కావడంతో ఉన్నతి ద్వారా శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తారని జాబ్ కో-ఆర్డినేటరు నరసింహులు ద్వారా తెలుసుకుని టీటీడీసీలో శిక్షణ తీసుకుంటున్నా. దూర ప్రాంతంలో అయినా సరే రిటైల్ రంగంలో ఉపాధి దొరికితే వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాను.

- వై.రామసుబ్బయ్య, ఎత్తిరాజులపల్లె, బద్వేలు మండలం

దిష్టి తగలకుండా...

● పొలంలో హీరోయిన్ల చిత్రాలు

రామసముద్రం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నరదిష్టికి నల్లరాయి అయినా పగులుతుందనేది పెద్దల నానుడి. దిష్టి పోవడానికి పురాతన కాలం నుంచి పలు రకాల బొమ్మలు పొలాల్లో పెడుతుంటారు. చిన్న పాపలకు బుగ్గలపై నల్ల చుక్క, ఇంటికి దిష్టి తగలకుండా దిష్టిబొమ్మలు కట్టడం, పొలాల్లో కుండకు తెల్లని చుక్కలు పెట్టి ఉంచడం, మనిషి ఆకారంలో బొమ్మలు ఉంచడం పాత పద్ధతులు. అయితే నేటి యువత వ్యవసాయ రంగంలో అడుగుపెట్టి వినూత్నమైన వ్యవసాయ విధానాన్ని అవలంభిస్తున్నారు. ఇందులో భాగంగా పంటలకు దిష్టి తగలకుండా ఇతరుల చూపు పంట పొలాలపై నేరుగా పడకుండా పొలాలలో అందమైన హీరోయిన్ల చిత్రాలు పెట్టి నరదిష్టి తగలకుండా చూస్తున్నారు.

మండలంలోని నారేవారిపల్లెకు చెందిన రైతు రెడ్డెప్ప తాను సాగు చేసిన టమోటా, బంతిపూల తోటలో అందమైన హీరోయిన్ల బొమ్మలు పెట్టాడు. దీంతో ఈ దారిలో వెళుతున్న వారి దృష్టి పంటపై కాకుండా హీరోయిన్ల చిత్రాలపై పడుతుందని దీంతో పంటకు దిష్టి తగలకుండా ఉంటుందని ఆ రైతు చెబుతున్నాడు. ఏదేమైనా ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను కంటికి రెప్పలా కాపాడుకోవడానికి రైతులు విభిన్న ప్రయోగాలు చేస్తున్నారు.

చూపరుల దృష్టి పంటపై పడకుండా..



నాకు రోడ్డు పక్కనే రెండు ఎకరాల పొలం ఉంది. ఇందులో ఎకరం టమోటా, ఇంకో ఎకరంలో బంతి పూలు తోట సాగు చేశాను. పూల తోట, టమోటా తోటలు పంట బాగా పండాయి. రోడ్డు పక్కన వెళ్లే వారు పంటను చూసి బాగా పండిందని చూస్తుంటారు. అందుకే వారి చూపు నేరుగా పంటపై పడకుండా అందమైన హీరోయిన్ల బొమ్మలు ఉంచాను.

-రెడ్డెప్ప, రైతు, నారేవారిపల్లె



బంతిపూలు, టమోటా తోటలలో పెట్టిన సినిమా హీరోయిన్‌ల చిత్రాలు

టమోటా తోటలో పెట్టిన దిష్టిబొమ్మ

గౌనివారిపల్లెలో దొంగల స్వైరవిహారం

రైతు ఇంట్లో 150 గ్రాముల బంగారు, రూ.5 లక్షల నగదు చోరీ

కురబలకోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గౌనివారిపల్లెలో ఓ రైతు ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. దీనికి సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నందిరెడ్డిగారిపల్లె పంచాయతీ గౌనివారిపల్లెకు చెందిన ఎం.సుబ్బారెడ్డి వ్యవసాయంతో పాటు వడ్డీ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా వ్యవసాయ పనుల నిమిత్తం భార్యాభర్తలిద్దరూ గురువారం ఉదయం పొలం వద్దకు వెళ్లారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాను పగలగొట్టి అందులోని 150 గ్రాముల బంగారు, రూ.5 లక్షల నగదును చోరీ చేశారు. రైతు పొలం వద్ద పనులు ముగించుకుని ఇంటికి రావడంతో విషయం వెలుగుచూసింది. దీంతో బాధితుడు పోలీసులకు సమాచారం అందించడంతో రూరల్ సీఐ రమేష్, ఎస్ఐ దిలీప్‌కుమార్‌లు సంఘటనాస్థలానికి చేరుకుని విచారించారు. అలాగే క్లూస్ టీంను రప్పించి ప్రత్యేకంగా తనిఖీలు చేశారు. కాగా తన కుమారుడు బెంగళూరులో స్థలాన్ని కొనుగోలు చేయడంతో అతనికి ఇవ్వడానికి తనకు రావాల్సిన డబ్బును పలువురి వసూలు చేసి ఇంట్లో పెట్టుకున్నట్లు ఆ రైతు చెబుతున్నాడు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బాధితుడి నుంచి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

కో-ఆప్షన్ సభ్యులకు గౌరవవేతనం కట్

● జీవో లేదని మూడేళ్ల తర్వాత కొర్రీ

● అప్పుడు లేని జీవో ఇప్పుడేంటని కోఆప్షన్ సభ్యుల ప్రశ్న

మదనపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మున్సిపాలిటీలోని ముగ్గురు కో-ఆప్షన్ సభ్యులకు గౌరవ వేతనం నిలిపేస్తూ మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల నిర్ణయం తీసుకున్నారు. ఫలితంగా మూడు నెలలుగా వేతనం రాకపోవడంపై సభ్యులు ఆందోళన చెందుతున్నారు. పాలకవర్గంలో ఛైర్‌పర్సన్‌తో పాటు వైస్‌ఛైర్మన్లు, కౌన్సిలర్లకు ప్రతినెలా ప్రభుత్వం గౌరవ వేతనం ఇస్తోంది. ఇందులో ఛైర్‌పర్సన్‌కు రూ.15 వేలు, వైస్‌ఛైర్మన్‌కు రూ.7,500, కౌన్సిలర్‌కు రూ.3,500, కో-ఆప్షన్‌సభ్యుడికి రూ.3,500 ఇస్తున్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రతినెలా సాధారణ, అత్యవసర సమావేశం నిర్వహిస్తుంటారు. ఛైర్‌పర్సన్‌తో పాటు కౌన్సిలర్ల తరహాలోనే కో-ఆప్షన్ సభ్యులు హాజరవుతుంటారు. వీరితో పాటు వీలునుబట్టి ఎక్స్ అఫిషియో సభ్యుడి హోదాలో స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా హాజరవుతుంటారు. ఎమ్మెల్యే మినహా వీరందరితో పాటు కో-ఆప్షన్ సభ్యులకు ప్రతినెలా గౌరవ వేతనం ఇస్తున్నారు. సమావేశానికి హాజరైనట్లు మినిట్స్ పుస్తకంలో సంతకం చేస్తేనే దాని ఆధారంగా సీఎఫ్ఎంఎస్‌లో ఆన్‌లైన్ బిల్లు పెడితే, వారి బ్యాంకు ఖాతాకు జమ అవుతోంది. ఇలా కౌన్సిల్ ఏర్పడిన మూడున్నరేళ్లుగా ఇదే జరుగుతోంది. కానీ మూడు నెలలుగా కో-ఆప్షన్ సభ్యులకు గౌరవ వేతనం రావడం లేదు. ఇదేమని ప్రశ్నిస్తే కో-ఆప్షన్ సభ్యులకు గౌరవవేతనం చెల్లించేలా జీవో లేదని, ప్రీ ఆడిట్ అభ్యంతరం చెబుతున్నట్లు కమిషనర్ ప్రమీల చెబుతున్నట్లు వారు వాపోతున్నారు.

తమకు ఇచ్చే రూ.3,500 కోసం కాదని, కో-ఆప్షన్ హోదాలో మున్సిపాలిటీ ఇచ్చే మర్యాదపూర్వకమైన వేతనం అంటూ సభ్యులు కె.జి.అబ్రహాం, కె.శ్రీదేవి, బి.శారదమ్మ చెబుతున్నారు. మూడున్నరేళ్లపాటు వచ్చిన వేతనం ఇప్పుడు రాకపోవడం ఏంటని? ఇన్ని రోజులు జీవో గుర్తుకురాలేదా? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో జీవో నెంబరు-398, 1998 ప్రకారం చెల్లిస్తున్నారని సభ్యులు చెబుతున్నారు. దీనిపై కమిషనర్‌ను వివరణ కోరగా ఆడిట్ అభ్యంతరాలతో మూడునెలలుగా ఆపేసినట్లు తెలిపారు. వీరితో పాటు పెట్టిన కౌన్సిలర్లకు కూడా ఇబ్బంది అవుతుంటే కో-ఆప్షన్ సభ్యులకు నిలిపేసినట్లు కమిషనర్ వివరించారు.

చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

● రూ.24 లక్షల విలువైన 17 కేజీల వెండి, 130 గ్రాముల బంగారం స్వాధీనం

● మీడియాకు వివరాలు వెల్లడించిన రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్



వివరాలు వెల్లడిస్తున్న రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్

రాయచోటిటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని సుండుపల్లె మండల కేంద్రంలో మూడు చోట్ల చోరీలకు పాల్పడిన ఇరువురు నిందితులను అరెస్టు చేసినట్లు రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ తెలియజేశారు. వారి వద్ద నుంచి రూ.24 లక్షల విలువ గల 17 కేజీల వెండి, 130 గ్రాముల బంగారు, అభరణాలను స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టుకు హాజరుపెట్టినట్లు చెప్పారు. గురువారం అయన రాయచోటి పట్టణంలో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. కడప జిల్లా అట్లూరు మండలం చలంగారిపల్లెకు చెందిన ప్రస్తుతం బద్వేల్ పట్టణంలోని గుంతపల్లిలో నివాసం ఉంటున్న గుమ్మాల వెంకటసుబ్బయ్య అతడి స్నేహితుడు రాజంపేట మండలం అత్తిరాల గ్రామానికి చెందిన ప్రస్తుతం కడప నగరంలోని తిలక్‌నగర్‌లో నివాసం ఉంటున్న గొర్లకుమార్ అలియాస్ అమర్ రాజ్‌కుమార్‌లు ఇరువురు కలిసి చోరీలకు పాల్పడుతున్నారన్నారు. ఆగస్టు 18వ తేదీ రాత్రి సుండుపల్లె మండల కేంద్రంలో కెనరా బ్యాంకు వెనుక వైపున సాయినగర్, పద్మరాజునగర్‌లో రెండు చోట్ల చోరీకి పాల్పడ్డారని, అలాగే అదే నెల 31వ తేదీ రాత్రి సుండుపల్లె బస్టాండు సమీపంలో గల ఆర్ఎస్ జ్యువెలరీ షాప్‌లో చోరీ చేయగా బాధితుల ఫిర్యాదు మేరకు ఈ చోరీల ఘటనపై సుండుపల్లె పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. నిందితులను ఇప్పటికే పలు చోరీల కేసుల్లో సిద్దవటం పోలీసులు అరెస్టు చేశారన్నారు. కోర్టు ఆదేశాలతో నిందితులను పోలీసు కస్టడీకి తీసుకుని విచారించగా సుండుపల్లె మండల కేంద్రంలో మూడు చోట్ల చోరీ చేసిన బంగారం, వెండి ఆభరణాలను రాయచోటి-సుండుపల్లె మార్గంలోని రాచంవాండ్లపల్లెకు సమీపంలో గల విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా అటవీ ప్రాంతంలో పాతిపెట్టినట్లు ఒప్పుకున్నట్లు డీఎస్పీ తెలియజేశారు. ఈ మేరకు వారి వద్ద నుంచి రూ.24 లక్షల విలువ గల 17 కేజీల వెండి, 130 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరు పెట్టినట్లు ఆయన వివరించారు. తక్కువ సమయంలో చోరీ కేసును ఛేదించడంలో ప్రత్యేక చొరవ చూపిన రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, సీసీఎస్ సీఐ చంద్రశేఖర్, సుండుపల్లె ఎస్ఐ శ్రీనివాసులు, సీసీఎస్ ఎస్ఐ రామక్రిష్ణారెడ్డి, సిబ్బందిని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అభినందించారు.

మిట్స్ అధ్యాపకురాలికి డాక్టరేట్ ప్రదానం



నాగశ్వేతను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ యువరాజ్

కురబలకోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన అధ్యాపకురాలికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తెలిపారు. కళాశాలలో ఈసీఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న గుత్తి నాగశ్వేత కర్ణాటక బెళగావిలోని విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్సిటీలో 'ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ఎలిప్టిక్ కర్వ్ క్రిప్టోగ్రఫీ యూసింగ్ ఫీల్డ్ ప్రోగ్రామబుల్ గేట్ అర్రే' అనే అంశంపైన చేపట్టిన పరిశోధనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారని తెలిపారు. కాగా డాక్టరేట్ సాధించిన ఆమెను కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్ యువరాజ్, విభాగాధిపతి రాజశేఖరన్ అభినందించారు.


స్థల ఆక్రమణలపై జేసీకి ఫిర్యాదు

పీలేరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తమకు కేటాయించిన ఇళ్ల స్థలాలను ఇతరులు కబ్జా చేస్తున్నారని పీలేరులోని పంచాయతీ పారిశుధ్య కార్మికులు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకటరామయ్య ఫిర్యాదు చేశారు. సర్వే నెం.1/16లో 2013లో ప్రభుత్వం 83 మంది పారిశుధ్య కార్మికులకు ఇంటి పట్టాలు మంజూరు చేసిందన్నారు. అయితే ఇటీవల కొంతమంది ఆ స్థలానికి నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేస్తున్నారని తమపై దాడులు చేస్తున్నారని, న్యాయం చేయాలని కోరారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కలికిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వరి పంట కోసే యంత్రం నడుపుతున్న డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని చీకటిపల్లె పంచాయతీ రంగనాథపురంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు కె.మారిముత్తు (21) తమిళనాడు రాష్ట్రం కడలూరు జిల్లా, వేపూరు తాలూకా, పెరయనేనలూరుగా తెలిసింది. గ్రామంలోని బి.రాధకు చెందిన వరి పొలంలో పంట కోసేందుకు హార్వెస్టర్ వాహనాన్ని అద్దెకు మాట్లాడుకున్నారు. వాహనంపైన అడ్డుగా వచ్చే చెట్ల కొమ్మలను తప్పించడానికి ఉపయోగపడే ఇనుప పైపును ఉంచుకున్నారు. బుధవారం మారిముత్తు అదే పొలం మీదుగా వెళుతున్న 11 కేవీ విద్యుత్ వైర్లను గమనించకుండా వరి పంటను కోస్తుండగా పైనున్న ఇనుప పైపుకు వైర్లు తగిలి విద్యుదాఘాతంతో పై నుంచి పడిపోయి మృతి చెందాడు. తమిళనాడు నుంచి మారిముత్తు తల్లిదండ్రులు గురువారం గ్రామానికి చేరుకుని అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ ఎస్.ఎం. మహమ్మద్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అవివాహితుడైన మారిముత్తుకు వయసుడిగిన తల్లిదండ్రులు, దివ్యాంగుడైన తమ్ముడు ఉన్నారని పోలీసులు తెలిపారు. శవ పరీక్ష అనంతరం మారిముత్తు మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు.





మహామర్రి

కడప నగర శివారులోని వాటర్‌గండి వద్ద రామలింగేశ్వరాలయం చెంతన మహా మర్రివృక్షం ఉంది. ఇక్కడి పెన్నా నది సందర్శనకు వెళ్లే పర్యాటకులు ఈ చెట్టుకింద సేదతీరుతుంటారు. ఎంతటి మండే ఎండల్లో అయినా ఇక్కడ చల్లగా ఉంటుంది. పక్కనే శివాలయం ఉండటంతో కార్తీక మాసంలో భక్తుల సందడి ఎక్కువగా ఉంటుంది. ఈ చెట్టుకు సుమారు 400 సంవత్సరాల వయసు ఉంటుందని ఆలయ పూజారి రోశయ్య తెలిపారు. చెట్టు విస్తరించే వీలులేకుండా ఒకవైపు ఆలయం మరోవైపు కొన్ని నిర్మాణాలు, ఇతర చెట్లు ఉన్నాయి. అయినా ఈ చెట్టుకు వందల సంఖ్యలో ఊడలు ఉండటంతో విశేషంగా ఆకట్టుకుంటోంది.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప

పాఠశాలల టైమింగ్స్‌లో మార్పు





- పైలెట్ ప్రాజెక్టుగా మండలానికి ఒక ఉన్నత పాఠశాల
- జిల్లాలో 36 పాఠశాలలను సిద్ధం చేసిన విద్యాశాఖ
- ఈ నెల 25 నుంచి 30 వరకు అమలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం పాఠశాల విద్యకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. పాఠశాలల టైమింగ్స్ మార్పు చేయాలని నిర్ణయించింది. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా మండలానికి ఒక ఉన్నత పాఠశాలలో అమలు చేసేందుకు 36 పాఠశాలలను జిల్లా విద్యాశాఖ సిద్ధం చేసింది. ఈ నెల 25 నుంచి 30 వరకు పైలెట్ ప్రాజెక్టు అమలు కానుంది.

రాష్ట్రంలో పాఠశాలల టైమింగ్స్ మారనున్నాయి. కొత్త టైమింగ్స్‌ను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసే ముందు పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలో అమలు చేయాలని ఉత్తర్వులు విడుదల చేసింది. 2024-25 విద్యా సంవత్సరంలో పాఠశాల టైమింగ్స్ మార్చాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పాత పనివేళలు వెయిటీతో పాటు ప్రతి పీరియడ్ సమయాన్ని మాత్రమే పెంచాలని స్పష్టం చేశారు. దీని ద్వారా ప్రతి ఉపాధ్యాయుడు సిలబస్‌ను కవర్ చేయడానికి.. బోధన అభ్యసనా ప్రక్రియకు తగినంత సమయం ఇవ్వనున్నారు. గతంలో ఉన్నత పాఠశాల పనివేళలు ఉదయం 9.45 నుంచి సాయంత్రం 4.40 వరకు కొనసాగుతుండేవి. వీటిపై ఉన్న ఇబ్బందులను గత పాలకులు పరిశీలించి పాఠశాల పనివేళలు ప్రాథమిక పాఠశాలలకనుగుణంగా మార్పు చేశారు. గత మూడేళ్లుగా ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు పాఠశాలలు కొనసాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం పనివేళలు మార్చేందుకు నిర్ణయం తీసుకోవడంతో ఉపాధ్యాయులు ప్రభుత్వ నిర్ణయాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు పాఠశాలలకు వచ్చేందుకు ఇబ్బంది పడే అవకాశాలున్నాయని వాపోతున్నారు.

ఇవే సమస్యలు

పాఠశాల పనివేళలు మార్పు చేయడం ద్వారా రవాణా సౌకర్యం అందుబాటులోకి లేని చోట ఐదు కి.మీ పరిధి నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థులు పలు సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. డ్రాపవుట్ల శాతం కూడా పెరిగే అవకాశం ఉందని వాపోతున్నారు. మరికొన్ని చోట్ల అనుకోని దుర్ఘటనలు కూడా సంభవించవచ్చని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి. మానసిక శాస్త్రం ప్రకారం విద్యార్థులపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఏడు గంటల పాటు పాఠశాలల్లో విద్యార్థులు ఉండడం ద్వారా మానసిక ఇబ్బందులకు గురయ్యే అవకాశం కూడా ఉందని పలువురు చెబుతున్నారు.

పాఠశాలల సమయం ఇలా....

రాష్ట్రవ్యాప్తంగా ఉన్నత పాఠశాలల్లో సమయాన్ని పెంచేందుకు అధికారులు ఉత్తర్వులు విడుదల చేశారు. యదావిధిగా ఉదయం 9గంటలకు ఫస్ట్ బెల్, 9.05కు సెకండ్ బెల్ ఉంటుంది. 9.25 వరకు 20 నిమిషాల పాటు ప్రార్థన ఉంటుంది. ఫస్ట్ పీరియడ్ 9.25 నుంచి 10.15 వరకు సెకండ్ పీరియడ్ 10.15 నుంచి 11 వరకు, 11 నుంచి 11.15 వరకు షార్ట్‌బ్రేక్ , 11.15 నుంచి 12 వరకు థర్డ్ పీరియడ్, 12 నుంచి 12.45 వరకు 4వ పీరియడ్, 12.45 నుంచి 1.45 వరకు లంచ్ బ్రేక్ ఉంటుంది. అనంతరం 1.45 నుంచి 2.30 వరకు ఐదో పీరియడ్, 2.30 నుంచి 3.15 వరకు 6వ పీరియడ్, 3.15 నుంచి 3.30 వరకు బ్రేక్, 3.30 నుంచి సాయంత్రం 4.15 వరకు 7వ పీరియడ్, 4.15 నుంచి 5గంటల వరకు 8వ పీరియడ్ జరగనుంది.

నవంబరు 30 వరకు పైలెట్ ప్రాజెక్టు

జిల్లాలో ప్రతి మండలంలో ఒక ఉన్నత పాఠశాలలో నవంబరు 25 నుంచి 30 వరకు పైలెట్ ప్రాజెక్టు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్‌లు ప్రతి మండలం నుంచి ఒక హైస్కూలు ప్లస్‌ని గుర్తించి పాఠశాలల జాబితాను నవంబరు 20న పంపించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ 36పాఠశాలలను గుర్తించి రాష్ట్రవిద్యాశాఖకు పంపించినట్లు సమాచారం.

ప్రారంభమైన పీజీ సెమిస్టరు పరీక్షలు



పరీక్షలను తనిఖీ చేస్తున్న వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పీజీ సెమిస్టరు పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. యూనివర్శిటీ ఆవరణలో ఏపీజే అబ్దుల్‌కలాం గ్రంథాలయంలో ప్రారంభమైన పరీక్షలను వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, పీజీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి క్రిష్ణారావు తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్‌టికెట్లను పరిశీలించారు. అనంతరం వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. చీఫ్ సూపరింటెండెంట్ ప్రొఫెసరు కాత్యాయని మాట్లాడుతూ పీజీ పరీక్షలకు తొలిరోజు 488 మంది హాజరయ్యారన్నారు. ఈ పరీక్షలు డిసెంబరు 4 వరకు కొనసాగుతాయని చెప్పారు. పరీక్షల నిర్వహణలో సూపరింటెండెంట్‌లు డాక్టర్ లక్ష్మిప్రసాద్, డాక్టర్ మునికుమారి పాల్గొన్నారు.

24న జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

కడప స్పోర్ట్స్, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి) : ఇషా ఫౌండేషన్ సారథ్యంలో గ్రామోత్సవ వేడుకలలో భాగంగా ఈనెల 24వ తేదీ ఆదివారం కడప డీఎస్ఏ మైదానంలో జిల్లా స్థాయి వాలీబాల్ (పురుషులు) క్రీడా పోటీలు జరుగనున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె.జగన్నాథరెడ్డి తెలిపారు. ప్రధానంగా గ్రామస్తులలో ఐక్యత, సంస్కృతిని మరింత పెంపొందింప చేయాలనే లక్ష్యంతో రాష్ట్రంలోని 13 జిల్లాలలో 16వ గ్రామోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతి ప్రదానం చేస్తారన్నారు. జిల్లాలోని ఆసక్తిగల వాలీబాల్ క్రీడాకారులు తప్పక పోటీలలో పాల్గొనాలని కోరారు. ప్రథమ బహుమతిగా 9వేలు, ద్వితీయ విజేతకు 6వేలు, తృతీయ విజేతకు 2 వేలు అందజేస్తామన్నారు. ఔత్సాహిక క్రీడాకారులంతా ఒకే గ్రామం, లేదా ఒకే పట్టణ పంచాయతీకి చెంది వుండాలన్నారు. కాగా మునిసిపాలిటీ, కార్పొరేషన్ పరిధి జట్లు అనర్హులన్నారు. కనీస వయస్సు 14 నుంచి వుండవచ్చన్నారు.

తక్కువ ధరకే నాణ్యమైన మద్యం ఇవ్వాలి

- వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీల్లో భాగంగా చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు నాణ్యమైన మద్యాన్ని తక్కువ ధరకే విక్రయించాలని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. పెంచిన ధరలు తగ్గించి బెల్టుషాపులను నియంత్రించాలని కోరారు. గురువారం కడప నగరం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మందుబాబులకు శుభవార్త. రేట్లు తగ్గించి నాణ్యమైన మందు ఇస్తామని ఎన్నికలముందు చంద్రబాబు చేసిన ప్రచార వీడియోను ప్రెస్‌మీట్‌లో రాచమల్లు ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నెన్నో హామీలు గుప్పించిన చంద్రబాబు గెలిచిన తరువాత ఇతరులను మోసం చేసినట్లే మందుబాబులను కూడా వంచించాడన్నారు. ఆయన చెప్పినట్లు ధరలు తగ్గించలేదని... అప్పుడు ఏ విధంగా ఉన్నాయో ఇప్పుడు కూడా అలాగే ఉన్నాయన్నారు. అప్పటి డిస్టలరీలే ఇప్పుడు కూడా ఉన్నాయని ఆరోపించారు. నాడు అదే మద్యం విషం అని ప్రచారం చేశారు. మరి ఇప్పుడు అదే మద్యం ఎలా విక్రయిస్తున్నారని ప్రశ్నించారు ఇప్పటికైనా ఇచ్చిన మాట ప్రకారం నాణ్యమైన మద్యం ఇవ్వాలని తెలిపారు.

కారు ఢీకొని విద్యార్థిని మృతి



సుమతి మృతదేహం

చాపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ద్వారకానగరం గ్రామం వద్ద కడప కర్నూలు జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మారిగాళ్ల సుమతి (17) అనే విద్యార్థిని మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు.. ద్వారకానగరం గ్రామానికి చెందిన సుమతి రోడ్డుకు అవతలివైపునకు వెళ్లి కొళాయి వద్ద బట్టలు ఉతుక్కుని తిరిగి ఇంటికి వచ్చేందుకు రోడ్డుదాటుతుండగా.. మైదుకూరు నుంచి కర్నూలు వైపు వెళుతున్న కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సుమతి మైదుకూరులోని ప్రభుత్వ కళాశాలలో జూనియర్ ఇంటర్ చదువుతోంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

కడప క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందాగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. కడప వన్‌టౌన్ సర్కిల్ వద్ద బుధవారం రాత్రి నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని ఆటో ఢీకొనడంతో మహమ్మద్‌రఫి (32) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే రిమ్స్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన మహ్మద్‌రఫి కొన్నేళ్లక్రితం కడపకు వచ్చి వైవీ స్ట్రీట్‌లోని బట్టల దుకాణంలో పనిచేస్తున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి... కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

కడప ఎర్రముక్కపల్లెకు చెందిన డాక్టర్ రాహుల్‌రెడ్డి ద్విచక్ర వాహనంలో బుధవారం రాత్రి వెళుతుండగా సీఎస్ఐ చర్చి సమీపంలో అదుపు తప్పి డివైడర్‌కు ఢీకొంది. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా వైద్యుల సూచనల మేరకు హైదరాబాదుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కువైత్‌లో గుండెపోటుతో వ్యక్తి మృతి

పెనగలూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువుకోసం కువైత్ వెళ్లిన మస్తాన్‌వల్లి (40) గుండెపోటు రావడంతో మూడు రోజుల కిందట మృతి చెందాడు. మృతదేహాన్ని గురువారం స్వగ్రామానికి తెప్పించి అంత్యక్రియలు పూర్తి చేశారు. కుటుంబసభ్యుల వివరాల మేరకు.. పెనగలూరు మండలం కొత్తపల్లె గ్రామానికి చెందిన మస్తాన్‌వల్లి యేడాది కిందట భార్యబిడ్డలను వదిలి కుటుం బ పోషణ కోసం కువైత్ వెళ్లాడు. అక్కడ షేక్ ఇంటిలో ఇంటి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మూడు రోజుల కిందట చాతిలో తీవ్రంగా నొప్పి వస్తుందని కువైత్‌లో ఉన్న బంధువులకు తెలపడంతో వారు షేక్ ఇంటివద్దకు చేరుకునే ప్రయత్నం చేశారు. అప్పటికే అతని యజమానులు ఆసుపత్రికి తరలిస్తుండగా మస్తాన్‌వలి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మస్తాన్‌వల్లి మృతితో కుటుంబం పెద్దదిక్కును కోల్పోయిందని.. ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామప్రజలు కోరుతున్నారు.

8 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



రాజంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజంపేట సమీపంలోని ఎస్ఆర్ పాలెం అటవీ ప్రాంతంలో 8 ఎర్రచందనం దుంగలు పట్టుకుని ఇద్దరు నిందితులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్సు పోలీసులు చిరంజీవులు, నరేష్, కిరణ్‌కుమార్‌లు కలిసి ఎస్ఆర్ పాలెంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా ఎర్రచందనం దుంగలు మోసుకువస్తున్న ఇరువురు నిందితులను పట్టుకుని దుంగలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

5 ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం



వల్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెరువుకిందపల్లె పాపాఘ్ని నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న 5 ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తహసీల్దారు శ్రీవాణి తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం రావడంతో తన సిబ్బందితో కలసి దాడులు నిర్వహించి 5 ట్రాక్టర్లను పట్టుకుని.. జరిమానా విధిస్తున్నట్లు తెలిపారు. ఇసుకను తమ కార్యాలయ అవరణలో డంప్ చేశామని.. ఎవరైనా ఎక్కడైనా అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దారు తెలిపారు.

పాఠశాలల పనివేళల పెంపు సరికాదు : ఎస్టీఎఫ్



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో పనివేళలు పెంచడం శాస్త్రీయ విధానానికి మనో విశ్లేషణ సిద్ధాంతానికి వ్యతిరేకమని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు తెలిపారు. గురువారం ఎస్టీఎఫ్ జిల్లాకార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాల్లోనే కాకుండా దేశంలో అగ్రస్థానంలో ఉన్న కేరళతో పాటు మరికొన్ని పాఠశాలలు ఉదయం 10 గంటల నుంచి 4గంటల వరకు కొనసాగుతున్నాయన్నారు. మన రాష్ట్రంలో పనివేళలు పెంచడానికి గల కార ణం ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. పాఠశాలల పనివేళలు విద్యార్థుల్లో అభ్యసనా సంసిద్ధత మానసిక పరిపక్వత, స్థానిక పరిస్థితులు, రవాణా సౌకర్యాలు వంటి అనేక అంశాలకు ముడిపడి ఉంటాయన్నారు. ఎక్కువ మంది విద్యార్థులు గ్రామీణ ప్రాంతం నుంచి వస్తుంటారు కాబట్టి రవాణా సౌకర్యంలో ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని తెలిపారు. పాఠశాలల పనివేళలను యదావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి ప్రసాద్, ఎల్‌వీ శంకర్ పాల్గొన్నారు

పోక్సో కేసు నమోదు

సీకేదిన్నె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడిన ముగ్గురిపై పోక్సో కేసు నమోదైనట్లు సీఐ శివశంకర్ నాయక్ తెలిపారు. మండలంలోని ఓ గ్రామం లో నెల రోజుల క్రితం ఓ బాలికపై ఇద్దరు అత్యాచారం చేశా రు. వారిద్దరితో పాటు మరో మైనర్ బాలుడు ఉన్నాడు. ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

జమ్మలమడుగు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని ఈడిగపేటకు చెందిన బోనాల బ్రహ్మయ్య (46) అదృశ్యమయ్యాడు. ఈనెల 1వ తేదీ సాయంత్రం మద్యం తాగి భార్య గోవిందమ్మతో గొడవపడి ఇంటి నుండి వెళ్లిపోయాడు. ఆ రోజు నుండి ఇప్పటి వరకు ఇంటికితిరిగి రాలేదని.. సెల్ స్విచ్ ఆఫ్‌లో ఉన్నట్లు అతని తండ్రి ఈశ్వరయ్య అర్బన్ పోలీసు స్టేషన్‌లో గురువారం సాయంత్రం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

24 నుంచి అండర్-23 మెన్స్ ఇంటర్ జోనల్ వన్డే క్రికెట్ పోటీలు

కడప స్పోర్ట్స్, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు ఏసీఏ అండర్-23 మెన్స్ ఇంటర్ జోనల్ వన్డే క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్ తెలిపారు. కడపలో గల ఏసీఏ, కేఎస్ఆర్ఎం, కోఓఆర్ఎం మైదానాలలో మ్యాచ్‌లు జరుగనున్నాయన్నారు.

భూమి విలువ పెంచుతాం: ఆర్డీఓ



గ్రామ సభలో మాట్లాడుతున్న ఆర్డీఓ భానుశ్రీ

వీరపునాయునిపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి కోసం తీసుకున్న భూమి విలువ 1.25 శాతం పెంచుతామని ఆర్డీఓ భానుశ్రీ అన్నారు. గురువారం వీరపునాయునిపల్లె, ఎస్.పాలగిరి, తంగేడుపల్లె గ్రామాలకు సంబంధించిన రైతులకు నేలతిమ్మాయపల్లెలో నిర్వహించిన గ్రామసభకు ఆర్డీఓ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జాతీయ రహదారికి సైడ్ భూమి విలువ రూ.11.90లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈవిషయమై రైతుల అభిప్రాయాలు తెలుసుకోవడమే గ్రామసభ ఉద్దేశ్యమన్నారు. అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు.

బీజేపీని మరింత బలోపేతం చేయాలి

వీరపునాయునిపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీని మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి తెలిపారు. గురువారం వీరపునాయునిపల్లె జీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మండల అధ్యక్షుడు గవేశ్వరయాదవ్ అధ్యక్షతన బీజేపీ క్రియాశీలక సభ్యుల కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ సత్తా నిరూపించాలంటే సంస్థాగతంగా బూత్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించి ప్రజలకు చేరువకావాలన్నారు. జిల్లా క్రియాశీలక ఇన్‌చార్జి శ్రీనాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్, పాలెం సురేష్‌కుమార్‌రెడ్డి, గండిగంగాధర్‌యాదవ్ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో
నకిలీ చలానాలు

- సృష్టించిన మున్సిపల్ సర్వేయర్
- కమిషనర్ సంతకం సైతం ఫోర్జరీ
- మున్సిపల్ ఆదాయానికి గండికొట్టిన వైనం
- మెమో జారీ చేసిన మున్సిపల్ కమిషనర్

ప్రొద్దుటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీని అవినీతి చీడ ఎంతకూ వదలనంటోంది. ఇంతవరకు మున్సిపాలిటీలో ఏదైనా పనిచేయడానికి పర్సెంటేజీల వంతున మామూళ్లు తీసుకునేవారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీలోని టౌన్ ప్లానింగ్‌లో ఉన్న సర్వేయర్ ఏకంగా మున్సిపాలిటీకి కట్టవలసిన చలానాలనే నకిలీవి సృష్టించి మరీ మున్సిపాలిటీ సొమ్ము స్వాహా చేశాడు. వివరాలిలా..

ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి ఏడాది క్రితం మున్సిపల్ సర్వేయర్‌గా కృష్ణకిశోర్ వచ్చినప్పటి నుంచి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. మున్సిపాలిటీలో ప్రైవేటు ప్రాపర్టీలకు సంబంధించి సర్వే నెంబరు కోసం వస్తే క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఇచ్చే ధ్రువీకరణ పత్రంకోసం ఆ స్థలం విలువను బట్టి రూ.5వేల నుంచి రూ.10వేల వరకు అక్రమంగా వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. అయితే నిర్దిష్టంగా అతనిపై ఇంతకాలం ఫిర్యాదులు రాలేదు. ఇటీవల ఒక సర్వే నెంబరు ధ్రువీకరణ కోసం కొందరు దరఖాస్తు చేసి మున్సిపాలిటీకి చెల్లించవలసిన చలానా రూ.1000తో పాటు సర్వేయర్ కృష్ణకిశోర్‌కు మరో రూ.5వేలు లంచంగా ఇచ్చారు. కానీ పనిచేయడంలో ఆలస్యం కావడంతో ఆ విషయం మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన మున్సిపల్ సర్వేయర్ సర్వేనెంబరు కోసం పెట్టిన ఫైల్స్‌ను తెప్పించి పరిశీలించారు. ఈ దరఖాస్తుకు చలానాలు కట్టారా లేదా అని పౌరసేవా కేంద్రంలోని క్యాష్ కౌంటర్‌లో రికార్డులు పరిశీలించారు. అక్కడ సర్వే నెంబరు ధ్రువీకరణ కోసం చలానాలు కట్టినట్లు రికార్డులో లేదు. కానీ ఈ చలానాలు ఎలా వచ్చాయి.. అని వాటిని నిశితంగా పరిశీలిస్తే అవి నకిలీవని తేలిపోయింది. చలానాల్లో క్యాషియర్ సంతకాలు సైతం లేకపోవడం కమిషనర్ సంతకం కూడా ఫోర్జరీ ఉండటం గుర్తించారు. కొద్దిరోజుల రికార్డు చెక్ చేస్తేనే 20 నకిలీ చలానాలు బహిర్గతమయ్యాయి. ఇంకా అతను పనిచేసిన దినాల్లో జారీ చేసిన సర్వే నెంబర్ల ధ్రువీకరణ పత్రాలను సమగ్రంగా పరిశీలిస్తే పూర్తి స్థాయిలో ఎన్ని నకిలీ చలానాలు సృష్టించాడో వెల్లడవుతుంది. ఈ నకిలీ చలానాలపై సంజాయిషీ కోరుతూ గురువారం మున్సిపల్ సర్వేయర్ కృష్ణకిశోర్‌కు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున మెమో ఇచ్చారు. దీనిపై మున్సిపల్ కమిషనర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా మున్సిపల్ సర్వేయర్ నకిలీ చలానాలు సృష్టించినట్లు వచ్చిన ఆరోపణలు వాస్తవమని అన్నారు. వాటిని రికార్డు పరంగా పరిశీలించి గుర్తించామన్నారు.. నకిలీ చలానాలతో పాటు కమిషనర్ సంతకం ఫోర్జరీ చేయడంతో అతనిపై ఎందుకు చర్య తీసుకోకూడదో ఒక్కరోజులో వివరణ ఇవ్వాలని మెమోలో పేర్కొన్నట్లు తెలిపారు. ఆయన ఇచ్చిన వివరణ ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'మధ్యాహ్న భోజన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి'

కడప నాగరాజుపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):మధ్యాహ్న భోజన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఏపీ మధ్యాహ్నభోజన కార్మిక సంఘం ఆధ్వర్యంలో కడప డీఈవో కార్యాలయంలో ఏడీ మునీర్‌ఖాన్‌కు వినతిపత్రం అందించారు.

వచ్చే విద్యా సంవత్సరంలో పులివెందుల మెడికల్ కళాశాలను ప్రారంభించాలి

● శాసన మండలిలో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

వేంపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని వైద్య కళాశాలను వచ్చే విద్యా సంవత్సరంలో కనీసం 150 సీట్లతో అయినా ప్రారంభించాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి కోరారు. శాసన మండలిలో గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ పులివెందులలో వైసీపీ ప్రభుత్వం మెడికల్ కళాశాలను నిర్మించిందని, అక్కడ 50శాతం మాత్రమే ఫ్యాకల్టీని ఏర్పాటు చేశారని, పూర్తిస్థాయిలో మౌలిక వసతులు లేని కారణంగానే 50 మెడికల్ సీట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. ఆ సీట్లతో కళాశాలను నిర్వహించే పరిస్థితి లేకపోవడంతోనే ప్రారంభం కాలేదన్న విషయం అందరికీ తెలిసిందే అన్నారు. ఈ విషయంపై వైసీపీ ప్రభుత్వం టీడీపీపై నిందలు వేయడం దురదృష్టకరమని, ఈ ప్రాంతంలో మెడికల్ కళాశాల అవసరమనేది టీడీపీ కృతనిశ్చయంతో ఉందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం కళాశాల ప్రారంభమయ్యేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ మండలి అధ్యక్షుడికి విజ్ఞప్తి చేశారు. భూముల సర్వే పేరుతో గత ప్రభుత్వం నిధులను దోచుకుందని, రీసర్వే ద్వారా రైతులు చాలా ఇబ్బంది పడ్డారని సభ దృష్టికి తెచ్చారు. పాత సర్వే సర్వేనెంబర్లతో ఉన్న విధంగానే రికార్డులను పునరుద్ధరించాలని కోరారు. ఇప్పటికీ కొందరు అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని, గండిలో గతంలో పనిచేసిన అసిస్టెంట్ కమిషనర్ ఉత్సవాల సందర్భంగా ఆహ్వానపత్రికలో ఎమ్మెల్సీ పేరు లేకుండానే చేశారన్నారు. అడిగినా అప్పట్లో ప్రతిపక్ష ఎమ్మెల్సీ కదా అనే ధోరణితో మాట్లాడారని గుర్తుచేశారు. ఇటీవల కడప రిమ్స్‌లో జరిగిన మంత్రి సమావేశానికి ఎమ్మెల్సీగా తనను గాని, లోకల్ ఎమ్మెల్యేని గాని ఎవరిని ఆహ్వానించలేదన్నారు. ఇలా కొంత మంది అధికారులు గత ప్రభుత్వంలో వ్యవహరించినట్లుగా వ్యవహరిస్తున్నారని, ఈ ధోరణి అధికారుల్లో మారేలా సంబంధిత మంత్రులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నట్లు తెలిపారు.

చిత్రం చెప్పిన సమస్య



రాయచోటి డిపోకు చెందిన బస్సులు చాలా వరకు కాలం చెల్లినవేనని, అవి తరచూ మరమ్మతులకు గురవుతుంటాయని పలువురు పేర్కొంటున్నారు. ఆ బస్సుల్లో ప్రయాణం గ్యారెంటీ ఉండదని వారు అంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం కూడా రాయచోటి డిపోకు చెందిన బస్సు నాగులగుట్టపల్లె వద్ద మొరాయించడంతో దాన్ని ప్రజలు తోయాల్సి వచ్చింది. రాయచోటి-వేంపల్లె రోడ్డులో ప్రయాణం అంటే నరకమేనని, బస్సులో ఎక్కితే ఆ శబ్దాలకు చెవులు మూసుకోవాల్సిందేనని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలం చెల్లిన బస్సులను ఆపేసి మంచి బస్సులు నడపాలని విన్నవిస్తున్నారు. -చక్రాయపేట, (ఆంధ్రజ్యోతి)

ఆఫీసర్స్ క్లబ్ నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కడప ఆఫీసర్స్ క్లబ్ నిధులు దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని క్లబ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. గురువారం వారు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆఫీసర్స్ క్లబ్ భవనం మరమ్మతులకు పూర్వ కలెక్టరు విజయరామరాజు క్లబ్ అధ్యక్షుని హోదాలో కోటి రూపాయలు విడుదల చేశారన్నారు. క్లబ్ కార్యదర్శిగా పనిచేసిన డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి నిధులను ఇష్టానుసారంగా ఖర్చు చేశారని ఆరోపించారు. క్లబ్‌లో విశ్రాంత ఇంజనీర్లు, అధికారులు సభ్యులుగా ఉన్నప్పటికీ ఎవరి సలహాల సూచనలు పాటించకుండా ఇష్టానుసారంగా నిర్మాణం చేపట్టారన్నారు. దీనిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారిలో ప్రభాకర్‌రెడ్డి, రామక్రిష్ణగౌడ్ ఉన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

పెండ్లిమర్రి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టమీదపల్లె గ్రామలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ గురువారం వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛారణలు మధ్య గణపతి పూజ, అభిషేకం, పూజా ద్రవ్యాలు పసుపు, కుంకుమ, తులసి చందనం తదితర వాటితో పూజ చేసి ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అనతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు.

'విద్యార్థిని ఆత్మహత్యాయత్నంపై విచారించాలి'

కమలాపురం రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కమలాపురం అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటనపై జిల్లా అధికారులతో విచారణ జరిపించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన ప్రిన్సిపాల్‌తో మాట్లాడారు. జిల్లా అధికారులు స్పందించి బాధ్యులను సస్పెండ్ చేయాలని, లేదంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కమలాపురం ఏరియా సహాయ కార్యదర్శి నాగేశ్వర్‌రావు, రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సికెదిన్నె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అచ్చగారి నాగరాజుకు గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. వారు అందించిన సమాచారం మేరకు కడప చెమ్ముమియా పేటకు చెందిన నాగరాజు గురువారం అవిశాకు తెచ్చుకునేందుకు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా భగత్‌సింగ్‌నగర్ వద్ద వెనుక నుంచి కారు ఢీకొనడంతో గాయాలయ్యాయన్నారు. చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని సీఈవో డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం వైవీయూలో ఎన్ఎస్ఎస్, హ్యాండ్స్ ఫర్ యు సంయుక్త ఆధ్వర్యంలో రక్తదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన యువకులు ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. కార్యక్రమానికి హాజరైన హ్యాండ్స్ ఫర్ యు ప్రతినిధి సుబ్బారావు రక్తదానంపై అవగాహన కల్పించారు.

'వ్యవసాయ కార్యాలయాన్ని వినియోగంలోకి తీసుకురండి'

సికెదిన్నె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె వ్యవసాయ శాఖ కార్యాయాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ఏపీ రైతు సం ఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యాలయం ముళ్లకంపతో నిండిందని, చిన్నపాటి మరమ్మతులు చేస్తే ఉపయోగించుకోవచ్చన్నారు. కార్యాలయానికి తాళం వేయడంతో ఏవో ఎక్కడ ఉన్నారో అర్థం కాలేదన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

సికెదిన్నె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గజ్జెల ఓబుళరెడ్డి (56) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతిచెందినట్లు సికెదిన్నె పోలీసులు తెలిపారు. వారు అందించిన సమాచారం మేరకు బుసిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఓబుళరెడ్డి, గత 10 సంవత్సరాల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఉండేవాడన్నారు. 18న విషద్రావణం తాగడంతో ఏలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించగా మంగళవారం రాత్రి మృతిచెందినట్లు తెలిపారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న పుత్తా నరసింహారెడ్డి

సికెదిన్నె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. చింతకొమ్మదిన్నె మండలం ఊటుకూరు సీతారామస్వామి ఆలయ ప్రతిష్ఠ సందర్భంగా ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి ప్రారంభించారు. బండలాగుడు పోటీలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పూజా కార్యక్రమాలో పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. బండలాగుడు పోటీల్లో మొత్తం ఆరు జతల ఎడ్లు పాల్గొని పోటాపోటీగా పందేలు జరిగాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు బహుమతులు అందజేశారు.

సమ్మెను జయప్రదం చేయండి

కడప(వినాయకనగర్), నవంబరు21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగాలను కార్పొరేట్ చేతుల్లో పెట్టే క్రమంలో కేంద్రం తీసుకున్న చట్టాలకు వ్యతిరేకంగా ఈ నెల 26న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని రైల్వేగూడ్స్ హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కేసీ బాదుల్లా, మహబూబ్‌బాషా పిలుపునిచ్చారు.గురువారం రైల్వేస్టేషన్ ఆవరణంలో హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వే, ఎల్ఐసీ, విమానయానం, బీఎస్ఎన్ఎల్ రంగాలను ప్రైవేటుపరం చేయడం దారుణమన్నారు.

ఇళ్లస్థలాలు ఇవ్వాలని పేదల వినతి



సచివాలయ అధికారికి అర్జీలను అందిస్తున్న మల్లిఖార్జున తదితరులు

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇళ్లస్థలాలు ఇవ్వాలని పేదలు అధికారులను విన్నవించారు. గురువారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 15వ డివిజన్ సచివాలయ అధికారికి వినతిపత్రం అందించారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం సెక్రటరీ మల్లిఖార్జున మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఇచ్చిన ఇళ్ల స్థలాలు నివాసయోగ్యంగా లేవన్నారు. అందులోనూ చాలా మందికి ఇప్పటికి ఇళ్లస్థలాలు చూపలేదన్నారు. ప్రస్తుతం సీఎం చంద్రబాబు ఎన్నికలకు ముందు పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున ఇళ్లస్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని నెరవేర్చాలన్నారు. ఇంటి నిర్మాణానికి పెరిగిన ధరల రీత్యా రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాము, అపర్ణ, నగర సహాయ కార్యదర్శి చైతన్య, గణేశ్, అనిల్ పాల్గొన్నారు.

అనాథలకు అన్నదానం

వేంపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె రాజీవ్‌నగర్ కాలనీలోని అనాథ వృద్ధాశ్రమంలోని అనాథలకు అన్నదానం చేశారు. ఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్ వెంకట రమణారెడ్డి, సౌజన్య దంపతుల పెళ్లిరోజు సందర్భంగా అన్నదానం, పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. ఆశ్రమ నిర్వాహకులు వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

'వైవీయూ, ఆర్కిటెక్చర్'లో అవినీతిపై అసెంబ్లీలో ప్రస్తావించాలి: పీడీఎస్‌యూ

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వైవీయూ, ఆర్కిటెక్చర్ యూనివర్సిటీల్లో జరిగిన అవినీతిపై అసెంబ్లీలో ప్రజాప్రతినిధులు స్పందించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. గురువారం పీడీఎస్‌యూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ, శాసనమండలి సమావేశాల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ అంశంపై మాట్లాడాలన్నారు. వీసీలుగా ఉన్న ఉన్న సూర్యకళావతి, చింతా సుధాకర్ అలాగే రిజిస్ట్రార్లు విజయరాఘవ ప్రసాద్, వెంకటసుబ్బయ్య నిధులను అక్రమ మార్గాల్లో వినియోగించారన్నారు. పీడీఎస్‌యూ నాయకులు ముబార్ బాషా, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

'రహదారులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించొద్దు'

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రహదారులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించొద్దని సీపీఐ నాయకులు హెచ్చరించారు. గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర మాట్లాడారు. రోడ్లపై గుంతలు పూడ్చడానికి టోల్ ట్యాక్స్ విధించాలనుకోవడం, పైలెట్ ప్రాజెక్టుగా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలో అమలు చేయాలనుకోవడం ప్రైవేటీకరణకు దారులు వేస్తున్నట్లుగా ఉందన్నారు. ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు ఎంవీ సుబ్బారెడ్డి, కేసీ బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వం భవిష్యత్తుకు భరోసా

● జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరిక్రిష్ణ



టీడీపీ సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొన్న వికాస్ హరిక్రిష్ణ

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం కార్యకర్తలు, ప్రజలు భవిష్యత్తుకు భరోసా అని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరిక్రిష్ణ తెలిపారు. గురువారం కడప నగరం 45వ డివిజనులో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు స్వచ్ఛందంగా పాల్గొని రూ.100 చెల్లించి సభ్యత్వం పొందారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వంద రూపాయల సభ్యత్వం తీసుకుంటే టీడీపీ రూ.5లక్షల ప్రమాద బీమా కల్పిస్తుందన్నారు. అలాగే సభ్యత్వం ఉన్న వారికి మరెన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఇటువంటి మంచి పథకాలు సభ్యత్వం ద్వారా అమలు చేస్తున్న సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ అనిల్, బూత్ ఇన్‌చార్జ్ ఉదయ్ పాల్గొన్నారు.

విజయదుర్గమ్మ సేవలో మెదక్ ఎమ్మెల్యే, మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే



అమ్మవారి శేష వస్త్రాలను అందజేస్తున్న దుర్గాప్రసాద్

కడప కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కడపలో వెలసిన జగన్మాత విజయదుర్గాదేవి సేవలో తెలంగాణ రాష్ట్ర మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పాల్గొన్నారు. గురువారం కడపకు విచ్చేసిన వారు ముందుగా విజయదుర్గాదేవి ఆలయానికి చేరుకుని ఆ తల్లి అనుగ్రహం కోసం ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ నిర్వాహకుడు దుర్గాప్రసాద్ స్వాగతం పలికి అమ్మవారి శేష వస్త్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఏదైనా పని నిమిత్తం కడపకు వచ్చినపుడు తప్పకుండా విజయదుర్గమ్మను దర్శించుకుంటామన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఉద్యోగుల సమీక్షా సమావేశం

కడప(వినాయకనగర్), నవంబరు21(ఆంధ్రజ్యోతి): గ్రామీణ నీటి సరఫరా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సమీక్షా సమావేశం జరిగింది. గృహ నిర్మాణ సంఘంలో సభ్యులుగా చేర్పించాలని కొందరు కోరగా అధ్యక్షుడు కొండారెడ్డితో మాట్లాడి సభ్యత్వం ఇప్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్నయ్య, మల్లేశ్వర్‌రెడ్డి, బాదుల్లా, పద్మనాదరావు తదితరులు పాల్గొన్నారు.

స్వామియే... శరణం అయ్యప్ప



ప్రత్యేక అలంకరణలో అయ్యప్ప స్వామి ఆలయం

పులివెందుల టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామంలో గురువారం అంగరంగవైభవంగా అయ్యప్ప అంబళం పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలతో ఆ మణికంఠున్ని ఆరాధించడం జరిగింది. ఈ అంబుళం పూజ కార్యక్రమానికి పులివెందుల నియోజకవర్గం నుంచి అయ్యప్ప భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. పెద్ద ఎత్తున ఈ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రత్యేక అలంకరణలో గణపూజతో పాటు పూజా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. దీంతో పాటు మాల ధరించిన అయ్యప్పస్వాములు భజన గీతాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా సాయంత్రం స్వామివారిని గ్రామోతవం నిర్వహించారు. కోలాట బృందం చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

అయ్యప్ప స్వామి, గోవిందమాల భక్తులకు అన్నదానం

కమలాపురం రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) టీడీపీ యువనేత పుత్తా లక్ష్మీరెడ్డి భార్య పుత్తా హరితారెడ్డి సహకారంతో అయ్యప్ప స్వామి, గోవిందమాల భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్తీక మాసంలో అన్నదానం చేస్తే మంచి శుభ ఫలితాలు వస్తాయని భక్తుల నమ్మకం. బాబా భక్తులు బాలసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ

పెండ్లిమర్రి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పరాజుపల్లెలో గురువారం అయ్యప్పస్వామి పడిపూజ పంగా చంద్రశేఖర్ గురుస్వామి ఆధ్వర్యంలో జరిగింది. స్వామివారికి అభిషేకాలు నిర్వహించి పడిపూజ చేశారు. పూజా కార్యక్రమంలో కన్నెస్వాములు, అయ్యప్ప స్వాములు పాల్గొని భజన చేశారు. అనతరం స్వాములకు మల్లికార్జునస్వామి భిక్ష ఏర్పాటు చేశారు.



కమలాపురంలో అయ్యప్ప స్వాములకు అన్నదానం చేస్తున్న పుత్తా కుటుంబ సభ్యులు

నరకప్రాయం - రైల్వేస్టేషన్ మార్గం

రోడ్డు పగుళ్లు ఏర్పడినా రాకపోకలు తప్పదు ● జోరుగా పరిగెడుతున్న ఇసుక ట్రాక్టర్లు

జమ్మలమడుగు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జోరుగా ఇసుక ట్రాక్టర్లు తిరుగుతుండడంతో స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డు, మున్సిపల్ కార్యాలయం నుంచి బైపాస్‌రోడ్డు నరకప్రాయాలుగా మారాయి. మున్సిపల్ కార్యాలయం నుంచి సిమెంటు రోడ్డు నెర్రలు బారడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పక్కనే ఉన్న రోటరీ నగర్ రోడ్డు దారుణంగా మారింది. ఆ ప్రాంతం చుట్టూ గుంతల్లో వర్షపునీరు నిలుస్తున్నాయి. ఆ ప్రాంత స్థలాల యజమానులు గుంతలను పూడ్చుకునేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అక్కడి నుంచి బైపాస్‌రోడ్డు వెళ్లాలంటే నరకప్రాయంగా మారింది. కన్నెలూరు, గొరిగెనూరు, తదితర ప్రాంతీయులు వెళ్లాల్సిందే. శేషారెడ్డిపల్లె ప్రజలు ఇదే దారిన జమ్మలమడుగుకు రావాల్సి ఉంటుంది. లేనిచో బైపాస్‌రోడ్డు ప్రొద్దుటూరు రోడ్డు మలుపు వద్దకు వెళ్లి జమ్మలమడుగు చేరుకోవాల్సి ఉంటుంది. మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టి రోటరీ నగర్ రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కార్యాలయం ఎదురు రోడ్డు బైపాస్ రోడ్డు వరకు నాణ్యతగా వేయించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. పట్టణంలోని నాగులకట్ట వీధి, చౌడేశ్వరీదేవాలయం నుంచి బుడగజంగం కాలనీ వరకు రోడ్డు తారు లేచి పోయి కంకర బయట పడింది. ఆ రోడ్డులో ప్రజలు వెళ్లాలన్నా ఇబ్బంది పడుతున్నారు. రాత్రిళ్లు కొన్ని చోట్ల వీధి లైట్లు వెలగడంలేదని వాపోతున్నారు. ఇటీవల దూర ప్రాంతాలకు వెళ్లాలంటే రైలు ప్రయాణమే చాలా మంది వెళుతున్నారు. అదే దారిలో దేవగుడి బ్రాంచ్ కెనాల్ కాలువ, బీసీ కాలనీ రోడ్డు గుంతలు పడి దారుణంగా ఉంది. మున్సిపల్ అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


నెర్రలుబారిన సిమెంటు రోడ్డు


తరలిపోతున్న ఇసుక ట్రాక్టర్

వారంలోగా నిర్వాసితులకు పరిహారం

కొండాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపురం చెరువు బ్యాక్‌వాటర్ కింద ముంపునకు గురయ్యే చిన్నపల్లె గ్రామంలో వారం రోజుల్లోగా పరిహారం అందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. గ్రామంలో 65 కుటుంబాలు ఆర్‌అండ్‌ఆర్ కింద గుర్తించారు. వీరిలో ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున రూ.6.5 కోట్లు అవసరమవుతాయి. ప్రస్తుతం రూ.2 కోట్లు మంజూరు కాగా ఈ పరిహారాన్ని అందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే గ్రామంలో అక్విడెన్స్‌లు తీసుకున్నారు. ఆర్డీఓ ఆఫీసులో ఆన్‌లైన్ ప్రక్రియ జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. 23వ తేదీలోపు రూ.2 కోట్లు చెల్లించకపోతే ఆ నిధులు వెనక్కిపోతాయని అధికారులు 23న పరిహారం చెల్లించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు


రక్తదానం చేస్తున్న యాపరాల చిన్న

మైదుకూరు రూరల్,నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ జన్మదిన వేడుకలు పార్టీ నేతలు, అభిమానులు గురువారం ఘనంగా చేసుకున్నారు. పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు ఆధ్వర్యంలో అన్నక్యాంటిన్‌లో మూడు పూటలా అన్నదానం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో యాపరాల చిన్న, బురుగోళ్ల చిన్న ఆధ్వర్యంలో సుమారు 50 మంది చేత రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కొత్తసాయి బాబా ఆలయం వద్ద అయ్యప్ప స్వాములకు అన్న ప్రసాద వితరణ చేశారు. మాజీ ఎంపీపీ ధనపాల జగన్, భూమిరెడ్డి రమణ, ఇస్మాయిల్, ధనపాల రవి, కోన సుబ్బారావు, భీమయ్య, బండి అమర్‌నాధ్, యుగంధర్, అక్బర్, జాకీర్, పిచ్చపాటి వీరా రెడ్డి, క్రిష్ణమూర్తి, యాపరాల లక్ష్మీనారాయణ, సుబ్బరాయుడు, ఎరికిలయ్య పాల్గొన్నారు. ఖాజీపేటలో టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో పాటిమీద పల్లెలో కేక్ కట్టింగ్, అనంతరం భోజనం అందించారు. దువ్వూరులో టీడీపీ కార్యకర్తల నడుమ మూడు రోడ్ల కూడలిలో వేడుక చేశారు. బ్రహ్మంగారిమఠం టీడీపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుక చేశారు. చాపాడు మండలం పల్లవోలు వద్ద వృద్ధాశ్రమం వృద్ధులకు టీడీపీ నేతలు పండ్లు, బ్రెడ్లు, చీరెలు పంపిణీ చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి టీడీపీ తదితరనేతలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గోపవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కుళ్లాయప్ప పేర్కొన్నారు. 33 కేవీ డి.అగ్రహారం ఫీడరు సబ్‌స్టేషన్, గుంతపల్లె సబ్‌స్టేషన్, పాయలకుంట్ల ఫీడరు శ్రీనివాసపురం పీపీకుంట సబ్‌స్టేషన్ల కింద గ్రామాలకు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. బైపాస్‌రోడ్డులో టవర్లు బిగించే పనుల కారణంగా అంతరాయం కలదని, కావున ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని డీఏఈ, ఏఈలు గురువారం ఒక ప్రకటనలో కోరారు.

అసెంబ్లీలో శ్రీనివాస ఫార్మసీ విద్యార్థుల సమస్య

ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ప్రస్తావన

ప్రొద్దుటూరు నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాస ఫార్మసీ కాలేజీ యాజమాన్యం నిర్వహణపై విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి గురువారం అసెంబ్లీలో సభ దృష్టికి తెచ్చారు. ప్రొద్దుటూరు మండలం పెద్దశెట్టిపల్లె పంచాయతీలో వున్న ఫార్మసీ కాలేజీ యాజమాన్యం అప్పు చేసి కాలేజిని సక్రమంగా నిర్వహించకుండా వదిలేసి వెళ్లిందని వివరించారు. ఫలితంగా దాదాపు 300 మంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని అసెంబ్లీలో సభ దృష్టికి తెచ్చారు. వారి చదువులు అగమ్యగోచరంగా తయారయ్యాయని యాజమాన్యం లేకపోవడంతో లెక్చరర్లు కూడా లేరని సీనియర్ విద్యార్థులు జూనియర్లకు చదువులు చెబుతున్నారని తెలిపారు. విద్యార్థులు నష్టపోకుండా ప్రభుత్వం వారందరినీ మరో కాలేజీకి తరలించి విద్యా సంవత్సరం నష్టపోకుండా పరీక్షలు నిర్వహించి న్యాయం చేయాలని ఆయన కోరారు.

క్రియాశీలక సభ్యత్వ నమోదు

జమ్మలమడుగు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో బీజేపీ క్రియాశీలక సభ్యత్వ నమోదు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఏర్పాటు చేశారు. గురువారం స్థానిక బీజేపీ కార్యాలయంలో సభ్యత్వ నమోదులో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సభ్యత్వ నమోదు విజయవంతంగా నిర్వహించాలని, అధిక సంఖ్యలో నమోదు జరగాలన్నారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చౌడం జొల్లు కొండయ్య, పట్టణాధ్యక్షుడు ఓబుళరెడ్డి, గ్రామీణ అధ్యక్షుడు వెంకటేష్, మైలవరం అధ్యక్షుడు ఎన్.శ్రీనివాసులు, కౌన్సిలర్ బాణా శివరామలింగారెడ్డి, సర్పంచ్ గురుశేఖర్‌రెడ్డి, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు మల్లిక, ఎంపీటీసీ కుమార్, పాల్గొన్నారు.

టీడీపీలో సముచిత న్యాయం


వేణుగోపాల్‌ను సన్మానిస్తున్న మైనార్టీ సభ్యులు

బద్వేలు రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడే వారికి సముచిత న్యాయం జరుగుతుందని మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టరు మహబూబ్ బాషా అన్నారు. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టరు కొలవలి వేణుగోపాల్‌ను సిద్దవటం రోడ్డులోని ఆయన కార్యాలయంలో సన్మానించారు. ఎన్నో ఏళ్లుగా బీసీల తరపున పార్టీ అభివృద్ధికి కృషి చేసిన వేణుగోపాల్‌ను నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టరుగా సీఎం చంద్రబాబు నియమించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నేత వడ్లపూటి నాగభూషణం, మాలేపాటి సునీల్‌కుమార్, గంప వెంకటయ్య, ట్రావెల్స్ రసూల్, పట్టణ టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్ఎం.బాష, కింగ్ ప్లాజా అధినేత గౌస్ అహ్మద్, ఆవాజ్ కమిటీ అధ్యక్షుడు సత్తార్, సిమెంటు షరీఫ్, మస్తాన్, ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య కాలనీకి రస్తా ఏర్పాటు


రస్తా ఏర్పాటుపై మాట్లాడుతున్న కమిషనర్

ఎర్రగుంట్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల సుందరయ్యనగర్‌కు మైలవరం కెనాల్ మీదుగా ఏర్పాటు చేసిన బ్రిడ్జిని అనుసంధానిస్తూ రస్తాను ఏర్పాటు చేస్తున్నారు. కెనాల్‌పై బ్రిడ్జి నిర్మించి ఏడాది కావస్తున్నా ఇరువైపులా లింక్ రస్తా కలపకపోవడంతో నిరుపయోగంగా తయారైంది. దీంతో సుందరయ్యనగర్ సహా వెంకటేశ్వరస్వామి గుడికి వెళ్లే వారికి తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ఇండస్ట్రియల్ ఎస్టేట్ నుంచి వచ్చే భారీ దుమ్ముతో ఈ రస్తాలో వెళ్లలేని పరిస్థితి ఉంది. గురువారం ఉదయం కమిషనర్ ఈ రస్తాను అనుసంధానం చేస్తూ దారి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రజలకు ఇబ్బందుల్లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు


గౌరీదేవి అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

జమ్మలమడుగు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వాసవీ ఆర్యవైశ్య మహిళల ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరీదేవాలయం వద్ద మురహరి లింగమూర్తి కల్యాణ మండపంలో గురువారం గౌరీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. 15వ తేదీ నుంచి ప్రారంభమైన పూజా కార్యక్రమాలు ఈనెల 24వ తేదీ వరకు జరుగుతాయన్నారు. రోజూ ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 7 గంటల నుంచి 7.30 గంటల వరకు గౌరీదేవి వ్రతపూజ ఘనంగా జరుగుతున్నాయన్నారు. నూకల పెద్దకుళాయిశ్రేష్ఠి, కేతేపల్లి గంగాధర్, మల్లెంకొండు సుబ్రమణ్యం పూజా కార్యక్రమాలకు సహకరించారు.

ఏపీజీబీ ఆధ్వర్యంలో అక్షరాస్యత సదస్సు


రాజుపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తొండలదిన్నె గ్రామంలో బుధవారం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు టంగుటూరు శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అవలంబన కార్యక్రమాన్ని మేనేజరు క్రిష్ణకిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళలు ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకాలు తదితర వాటిపై కళాబృందం మహిళలకు వివరించారు. త్వరలో మహిళలకు సోలార్ ప్యానెల్‌ను సబ్సిడీతో అందిస్తారని వాటిని కూడా వినియోగించుకోవాలన్నారు. బ్యాంకు ఆధ్వర్యంలో ప్రత్యేక రుణాలు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో క్యాషియర్ సోమశేఖర్, కళాబృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా తయారు చేస్తే చర్యలు తప్పవు


గంజికుంట తండా వాసులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ అధికారులు

మైదుకూరు రూరల్,నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నాటుసార బట్టీలు పెట్టి తయారు చేయాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని కడప అసిస్టెంట్ ఎక్సైజ్ అధికారి వినోద్ హెచ్చరించారు. గంజికుంట సుగాలితండాలో ఎక్సైజ్ జిల్లా ఉన్నతాధికారులు పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడుతూ నాటుసారా తయారు చేస్తే కఠినచర్యలు ఉంటాయని, నాన్‌బెయిల్ కేసులు పెడతారని వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ అధికారి రవి, మైదుకూరు ఎక్సైజ్ సీఐ ధీరజ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పొలాల్లోకి కాల్వ నీరు



జమ్మలమడుగు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పొన్నతోట గ్రామ సమీపంలో మెయిన్ కాల్వను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీంతో మైలవరం జలాశయం నుంచి విడుదల చేసిన నీరు పక్కదారి పట్టింది. నీటి ప్రవాహం పొన్నతోట పొలాల్లోకి చేరుతోంది. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులు ధ్వంసమైన కాల్వకు మరమ్మతులు చేపట్టాలని పలువురు రైతులు కోరారు.

ముఖాముఖి



మండలాన్ని అభివృద్ధి చేస్తాం

- రామకృష్ణయ్య, ఎంపీడీఓ -

మండల అభివృద్ధి కోసం నిధులు పుష్కలంగా మంజూరయ్యాయి. గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయి. సిమెంటు రోడ్ల నిర్మాణం జరుగుతున్నా నాణ్యత లోపంపై విమర్శలున్నాయి. పంచాయతీల్లో పారిశుధ్య లోపం వెంటాడుతోంది. అరకొర విమర్శలున్నా మండలంలోని గ్రామాలను అభివృద్ధి బాట పట్టిస్తామని ఎంపీడీఓ రామకృష్ణయ్య తెలిపారు.

?: ఎంజీఎన్‌ఆర్‌జీఎస్ నిధులు మంజూరెంత

!: మండలానికి 9 కి.మీ. పొడవునా రోడ్ల నిర్మాణానికి రూ.2.61 కోట్లు మంజూరైంది. 25 పశుపాకల నిర్మాణానికి రూ.54.60 లక్షలు మంజూరైంది.

?: ఉపాధి హామీ లక్ష్యం నెరవేరుతోందా

!: కేంద్రం ద్వారా రాష్ట్రానికి అందే నిధులతో అభివృద్ధి పనులు విస్తృతంగా చేపడుతున్నాం.

?: గ్రామ సచివాలయాల పనితీరు ఎలా ఉంది

!: 15వ ఆర్థిక సంఘం నిధులు సకాలంలో జమ కావడంతో పారిశుధ్యం, మంచినీరు, ప్రహరీ నిర్మాణం, రోడ్ల మరమ్మతు పనులు జరుగుతున్నాయి

?: ప్రజలను లంచం అడుగుతున్నారనే ఆరోపణలపై మీరేమంటారు.

!: ప్రజా సమస్యలు తీర్చడం అధికారుల బాధ్యత. ఎవరైనా డబ్బు అడిగినట్లు నిరూపణ అయితే శాఖా పర చర్యలు తప్పవు.

?: గ్రామీణ ప్రాంత రోడ్ల సమస్యలపై చర్యలు

!: 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరవుతుండడంతో మరమ్మతులు చేపట్టి రహదారుల సమస్య పరిష్కరిస్తాం.

?: ఆర్‌అండ్‌బీ రోడ్లపై పారుతున్న మురుగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతారా.

!: ఈ సమస్య రెవెన్యూ, పంచాయతీ, పోలీసు శాఖల పరిధిలో ఉంటుంది. సర్వే చేయించి అందరి సహకారంతో సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

?: ఎన్‌ఆర్‌జీఎస్ రోడ్లను కమీషన్లకు విక్రయించుకుంటున్నారనే ఆరోపణలపై మీరేమంటారు.

!: ఈ విషయం మా దృష్టికి రాలేదు. కమీషన్ల విషయం, నాణ్యత లోపం జరిగితే శాఖాపర చర్యలు ఉంటాయి.

- దువ్వూరు, ఆంధ్రజ్యోతి

రాత్రివేళ డాక్టర్‌ను ఏర్పాటు చేయాలి


ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నేతలు

కొండాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రాత్రిళ్లు ఉండేలా డాక్టర్‌ను నియమించాలని సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు కోరారు. గురువారం కొండాపురం ప్రభుత్వాస్పత్రి సమస్యలపై ఎంపీడీఓ నాగప్రసాద్‌కు వినతపత్రం అందజేశారు. ఆస్పత్రిలో ఈసీజీ సౌకర్యం లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, నైట్ వాచ్‌మెన్, ల్యాబ్ పరికరాలను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు మంత్రి సత్యకుమార్‌కు, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి, డీఎంహెచ్‌ఓకు లేఖలను పంపినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాము తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత ఫారెస్టు భూముల రైతులకు నోటీసులు

కొండాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పొట్టిపాడు, వెంకయ్యకాల్వ గ్రామాల్లో ఫారెస్టు భూములను అక్రమించుకున్న రైతులకు నోటీసులు జారీ చేసినట్లు ముద్దనూరు ఫారెస్టు రేంజర్ అనిల్‌కూమార్ యాదవ్ తెలిపారు. గ్రామంలో సుమారు 17 ఎకరాలు, వెంకయ్యకాల్వ గ్రామంలో 14 ఎకరాలు ఫారెస్టు భూములు రైతులు ఆక్రమించినట్లు గుర్తించమన్నారు. ఈ మేరకు ఆ గ్రామాల్లో సర్వేచేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఫారెస్టు గెజిట్ ప్రకారం మేరకే తాము భూముల్లో సర్వే చేస్తున్నామని ఆయన తెలిపారు. అందరికీ నోటీసులు జారీచేస్తామన్నారు.

'దాల్మియా బాధితులను ఆదుకోవాలి'

జమ్మలమడుగు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దాల్మియా సిమెంటు ఫ్యాక్టరీ బాధితుల సమస్యలపై ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి శాసనమండలిలో ప్రస్తావించినట్లు జమ్మలమడుగు విలేకరులకు తెలిపారు. మైలవరం మండలం చిన్నకొమెర్ల నవాబుపేట, దుగ్గనపల్లి గ్రామాల మధ్య ప్రధాన రోడ్డు పక్కన దాల్మియా సిమెంటు ఫ్యాక్టరీ ఉంది. కొన్నేళ్లుగా కర్మాగారంతో స్థానిక గ్రామాల కుటుంబీకులు వివిధ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్సీ శాసనమండలిలో సమస్యలను తెలిపారు. దుగ్గనపల్లి గ్రామంలో వర్షం వస్తే ఆ ప్రాంతమంతా పొలాల్లో నీళ్లు నిలుస్తాయని, ఫ్యాక్టరీ వలన ఆ చుట్టుపక్కల గ్రామాల్లో గోడలు నెర్రలుచీలాయని, వివిధ సమస్యలపై బాధితులకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు.

విద్యార్థులు ఆరోగ్యాన్ని రక్షించుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆరోగ్యాన్ని రక్షించుకోవాలని డాక్టర్ ఎన్.హిమబిందు పేర్కొన్నారు. గురువారం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా వైఎంఆర్ కాలనీలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు ఆకుకూరలు, కూరగాయలు, గుడ్లు, పాలు వంటి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. చేతులను శుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కాశీం, వార్డు హెల్త్ సెక్రటరి జ్యోతి, సీహెచ్ సుబ్బారెడ్డి, ఆశా వర్కర్లు పుష్పకుమారి, మల్లీశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాక్టర్లు సీజ్ - జరిమానా

అట్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం పెన్నానది నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను రెడ్డిపల్లె వద్ద సీజ్ చేసి అట్లూరు తహసీల్దారుకు అప్పగించినట్లు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు. రెండు ట్రాక్టర్లకు రూ.20వేలు జరిమానా విధించారని తహసీల్దారు సుబ్బలక్షుమ్మ తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రెడ్డి, చంద్ర, శేఖర్ తదితరులు ఉన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ


మృతదేహాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

బి.కోడూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎల్లుబోయిన నారాయణ, ఎల్లుబోయిన పరమేశు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి పరామర్శించారు. బుధవారం నారాయణ, పరమేశు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి గురువారం శవాలను కుటుంబీకులకు అప్పగించారు. ఏకకాలంలో ఇద్దరు మృతి చెందడంతో గ్రామస్తులు, బంధువులు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు శోకసంద్రంలో మునిగారు. నారాయణకు ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు భార్య లక్ష్మీదేవి, పరమేశుకు తండ్రి ఈశ్వరయ్య, తల్లి సుబ్బమ్మ ఉన్నారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని విజయమ్మ భరోసా ఇచ్చారు. పెద్దిరెడ్డి అమర్‌నాధ రెడ్డి, జయరామిరెడ్డి సుబ్బారెడ్డి, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

హాస్టల్ ప్రహరీని కూల్చినవారిపై కేసు పెట్టాలి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ ప్రహరీని కూల్చిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్‌రాజు పేర్కొన్నారు. గురువారం నడింపల్లెలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో ప్రహరీని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రైవేటు వ్యక్తులు ప్రహరీని కూల్చడం దారుణమన్నారు. దీంతో విద్యార్థులకు రక్షణ లేకుండాపోయిందని, మురికినీరంతా వసతి గృహం ఆవరణలోనే నిలిచి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనిపై సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రహరీ కూల్చినవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.